



బస్సులకు సపరూటు

- ప్రమాదాల నివారణకు ప్రయోగం
- తొలి విడతగా మూడు మార్గాల్లో అమలు

(చెన్నై, ఆంధ్రజ్యోతి)

నగరంలో రోజురోజుకు పెరిగిపోతున్న ట్రాఫిక్ సమస్యను అరికట్టి, రోడ్డు ప్రమాదాల ను నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగాలకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా చెన్నైలో బస్సుల కోసం ప్రత్యేక మార్గం ఏర్పా టు చేయాలని నిర్ణయించింది. తొలి విడతగా నగరంలో మూడు మార్గాల్లో నడిపి, ఆయా ప్రాంతాల్లో వచ్చే స్పందన బట్టి మిగిలిన ప్రాం తాలకు కూడా విస్తరించాలని భావిస్తోంది. ఈ మేరకు రహదారుల శాఖాధికారులు సన్నాహాలు చేపట్టారు. సిగ్నల్స్ పాటించడంలో చెన్నై వాసులు మిగిలిన మెట్రోనగర వాసుల కంటే మెరుగ్గానే వున్నా.. రోడ్డుకి ఇటు వైపు నుంచి అటువైపుకి ఉరుకులు పరుగులు పెట్టే ద్విచక్రవాహనదారులకు కొదవేం లేదు. ఇక బస్సుల సంగతి చెప్పనక్కర్లేదు. వీటన్నింటికీ పరిష్కారంగా బస్సులకు ప్రత్యేక మార్గం ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభు త్వం నిర్ణయించింది. అంతేగాక పెరుగుతు న్న జనాభాకనుగుణంగా బస్సు ల సంఖ్య కూడా పెంచినా ట్రాఫిక్ సమస్య లేకుండా వుంటుందని భావిస్తోంది.

సాధ్యాసాధ్యాలపై అధ్యయనం ..

బస్సుల కోసం ప్రత్యేక మార్గం ఏర్పాటు చేయడం వల్ల కలిగే లాభనష్టాలపై రహదారుల శాఖ అధ్యయనం చేస్తోంది. ఇప్పటికే సాధ్యాసాధ్యాలపై అధికారులు ఒక అంచనాకు వచ్చినట్లు సమాచారం. దీనిపై ప్రభుత్వానికి నివేదిక అందగానే కార్యాచరణలోకి దిగేలా చకచకా పనులు జరుగుతున్నాయి. దీని గురించి ఓ ఉన్నతాధికారి మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో బస్సుల సంఖ్య పెరగడంతో ట్రాఫిక్ రద్దీ కూడా పెరిిందని, ఆఫీసు సమయంలో పలు చోట్ల రద్దీ అరగంట వరకు కొనసాగుతోందని తెలిపారు. నగరంలో వాణిజ్య ప్రాంతాలు, కర్మాగారాలను కలిపే బ్రాడ్‌వే-పూందమల్లి-ఈవేరా రోడ్డులో ప్రతిరోజూ 1,500లకు పైగా బస్సులు తిరుగుతున్నాయి. ఉదయం, సాయంత్రం బస్సుల వేగం గంటకు 12 నుంచి 15 కి.మీ వరకు పెంచారు. అదే సమయంలో ప్రత్యేక బస్సులు నడుపుతున్న నీలాంగరై-పల్లావరం జంక్షన్ రోడ్డు, విమానాశ్రయం, ఈసీఆర్, ఓఎంఆర్ ప్రాంతాలను కలుపుతూ బస్సులకు ప్రత్యేక మార్గం ఏర్పాటుచేస్తే సత్ఫలితాలు వస్తాయని అధికారులు భావిస్తున్నారు. అలాగే నగరం నుంచి రాకపోకలు సాగించే లోడు వాహనాల కోసం వండలూరు-మీంజూరు బైపాస్ రోడ్డులో ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు ప్రత్యేక మార్గం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కూడా వారు భావిస్తున్నారు. అందువల్ల అడయార్-బ్రాడ్‌వే-పూందమల్లి రోడ్డు, నీలాంగరై-పల్లావరం సర్వీస్ రోడ్డు, వండలూరు-మీంజూరు బైపాస్ రోడ్లలో బస్సులు మాత్రమే వెళ్లేలా ప్రత్యేక మార్గం ఏర్పాటుచేయాలని ప్రణాళిక రూపొందిస్తున్నారు. అంతేగాక ఏఐ పరిజ్ఞానంతో కూడిన సీసీ కెమెరాలు, ఇతర వాహనాలను గుర్తించేలా అత్యాధునిక సీసీ కెమెరాలు, డిజిటల్ విధానంలో సత్వరం జరిమానా విధించేలా ప్రత్యేక మార్గంలో పరికరాలు ఏర్పాటుచేయనున్నారు. రహదారులు, రవాణా శాఖ, చెన్నై కార్పొరేషన్ సంయుక్తంగా కంట్రోల్ రూం ఏర్పాటుచేయనున్నాయి. తొలిగా మూడు మార్గాల్లో స్థలం గుర్తించే పనులు చేపట్టినట్లు రహదారుల శాఖ అధికారులు తెలిపారు.

ట్రయల్ రన్...

ప్రజలకు, వాహనదారులకు అవగాహన కలిగేందుకు ముందుగా సెలవు రోజులు, వారాంతపు రోజుల్లో ట్రయల్ రన్ నిర్వహించనున్నారు. అనంతరం ప్రజాభిప్రాయం, ట్రాఫిక్ డేటా, పోలీసుల నివేదిక తదితరాలు పరిశీలించి, అవసరమైన సవరణలు చేపట్టనున్నారు. నగరంలో ప్రస్తుతం 58 లక్షల ద్విచక్ర, మూడు, నాలుగు చక్రాల వాహనాలు నడుస్తున్నాయి. అలాగే, ప్రతి ఏడాది 8-10 శాతం మేర కొత్త వాహనాల రిజిస్ట్రేషన్ జరుగుతోంది. బస్సులకు ప్రత్యేక మార్గం ఏర్పాటుచేస్తే ప్రైవేటు వాహనాల సంఖ్య కూడా తగ్గే అవకాశముంది. అలాగే, వాతావరణ కాలుష్యం 12 నుంచి 15 శాతం వరకు తగ్గుతుంది. ఎంటీసీ బస్సుల వేగం పెరిగి, ఇంధన వృథా తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు. రెండవ విడతలో జీఎస్టీ రోడ్డు, అన్నాసాలై, అంబత్తూర్, మూలకడై, ఆవడి, గిండి, సెయింట్ థామస్ మౌంట్ తదితర రోడ్లపై బస్సులకు ప్రత్యేక మార్గం ఏర్పాటుచేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

తుపాను హెచ్చరికలతో ముందు జాగ్రత్త చర్యలు

- అధికారులతో మంత్రి రామచంద్రన్ చర్చలు



కంట్రోల్ రూంలో వాయుగుండం కదలికలను మంత్రికి వివరిస్తున్న రెవెన్యూ, విపత్తుల నిర్వహణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పి.అముద

చెన్నై, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఈశాన్య రుతుపవనాలు తీవ్రరూపం దాల్చటం, బంగాళాఖాతంలో వాయుగుండం కారణంగా రాష్ట్రంలో తుఫాన్ ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టే విషయమై రెవెన్యూ అధికారులతో ఆ శాఖ మంత్రి కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్ బుధవారం ఉదయం సమీక్షించారు. వాయుగుండటం కారణంగా ఈ నెలాఖరు వరకు చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు, విల్లుపురం, కడలూరు, తిరువణ్ణామలై తదితర తీర ప్రాంత జిల్లాల్లో భారీగా వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ కేంద్రం హెచ్చరికల నేపథ్యంలో వర్షబాధిత ప్రాంతాల్లో ముందస్తుగా చేపట్టాల్సిన సహాయక చర్యలపై మంత్రి దృష్టిసారించారు. ఆ మేరకు నగరంలోని రెవెన్యూశాఖ ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లో డిజిటల్ స్క్రీన్‌పై బంగాళాఖాతంలోని వాయుగుండం కదలికలపై వాతావరణ కేంద్రం విడుదల చేసిన శాటిలైట్ చిత్రాలను ఆయన పరిశీలించారు. ఈ సమావేశంలో రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి పి.అముద, విపత్తుల నిర్వహణ కమిషనర్ సీజీ థామస్, విపత్తుల నిర్వహణ విభాగం మేనేజింగ్ డైరెక్టర్ సి.ముత్తుకుమరన్, రెవెన్యూ కమిషనర్ ఎం.సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈపీఎస్ రైతు కాదు... ద్రోహి

- ఈరోడ్ సభలో స్టాలిన్ ధ్వజం



స్వాతంత్ర్య సమరయోధుడు పొల్లాన్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి

చెన్నై, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తానొక రైతునంటూ గొప్పలు చెప్పుకునే ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) వాస్తవానికి రైతు కానేకాదని, సాగుపనులకు వెళ్లకుండా ఆయన చేస్తున్నదంతా ద్రోహమేనని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మండిపడ్డారు. రైతు నాయకుడిలా మెడలో ఆకుపచ్చ తువ్వాలు ధరించి ఈపీఎస్ చేస్తున్నదంతా ద్రోహమేన్నారు. ఈరోడ్‌లో బుధవారం ఉదయం రూ.4.90 కోట్లతో ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య సమరయోధుడు పొల్లాన్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించి, స్మారక మండపాన్ని ప్రారంభించారు. రూ.605.44 కోట్లతో పూర్తయిన పథకాలను ప్రారంభించి, రూ.91.09 కోట్లతో చేపట్టనున్న 23 కొత్త పథకాలకు శంకుస్థాపన చేశారు. వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల కింద 1,84,491 మంది లబ్ధిదారులకు సహాయాలను అందజేశారు. ఈ సందర్భంగా సభలో స్టాలిన్ మాట్లాడుతూ రాష్ట్రంలోని రైతాంగానికి ఆయన చేసిందేమీ లేదని ధాన్యం తేమ శాతాన్ని పెంచేందుకు అంగీకరించని కేంద్రంలోని బీజేపీ పాలకులతో ఈపీఎస్ చర్చలు జరిపి ధాన్యంలో తేమ శాతాన్ని పెంచమని అడగొచ్చు కదా అని ప్రశ్నించారు. డీఎంకే ద్రావిడ తరహా పాలనలో ప్రజా సంక్షేమం కోసం ప్రతిరోజూ పథకాలను అమలు చేస్తుండటాన్ని చూసి ప్రతిపక్షపార్టీలు ఓర్వలేక తమపై పసలేని విమర్శలు చేస్తున్నాయని ఆరోపించారు.



ఈరోడ్‌లో ఆటో అందుకున్న మహిళతో మాట్లాడుతున్న స్టాలిన్

ఈరోడ్‌కు వరాల జల్లు....

ఈరోడ్ జిల్లాలో అమలు చేయనున్న ఆరు పథకాలను సభలో స్టాలిన్ ప్రకటన చేశారు. ఆ మేరకు పుంజయ్ పుళియంపట్టి మునిసిపాలిటీకి రూ.4.30 కోట్లతో, గోపిశెట్టిపాళయం మునిసిపాలిటీకి రూ.4.50 కోట్లతో కొత్త కార్యాలయ భవనాలను నిర్మించనున్నామని, భవానీసాగర్, కీళ్‌భవానీ నీటి సాగుభూముల దిగువ సత్యమంగళం, నంబియూరు, భవానీ తదితర ప్రాంతాలకు చెందిన రైతులకిచ్చిన తాత్కాలిక భూ పట్టాలను శాశ్వత పట్టాలుగా మార్చుతున్నామని సభికుల హర్షధ్వానాల నడుమ ప్రకటించారు. అందియూరు సమీపంలో తోనిమడువపల్లం (వాగుపై) వద్ద రూ.4 కోట్లతో చెక్‌డ్యామ్ నిర్మిస్తామని, అద్దకపు పరిశ్రమల వ్యర్థాల కారణంగా కాలుష్యమవుతున్న నొయ్యల్‌వాగు ఆయకట్టు రైతులకు నష్టపరిహారం చెల్లించే విషయంలో పెండింగ్‌లో ఉన్న పలు కేసుల పరిష్కారానికి నిపుణుల కమిటీని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కేఎన్ నెహ్రూ, ఈవీ వేలు, ఎస్. ముత్తుసామి, ఎంపీ సామినాథన్, డాక్టర్ ఎం. మదివేందన్, ఎన్ కయల్‌విళి సెల్వరాజ్, ఎంపీలు అందియూరు సెల్వరాజ్, కేఈ ప్రకాష్, కె.సుబ్బరాయన్, ఎమ్మెల్యేలు వీసీ చంద్రకుమార్, ఏజీ వెంకటాచలం, ఈరోడ్ జిల్లా కలెక్టర్ ఎస్. కందసామి, ఈరోడ్ మేయర్ నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.

5న పుదువైలో విజయ్ రోడ్‌షో

- పోలీసుల అనుమతి కోరుతూ టీవీకే దరఖాస్తు

పుదుచ్చేరి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) అధ్యక్షులు విజయ్ డిసెంబరు 5న పుదుచ్చేరిలో రోడ్ షో నిర్వహించనున్నారు. టీవీకే పేరుతో పార్టీ ప్రారంభించిన నటుడు విజయ్, రాబోయే శాసన సభ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కార్యకర్తలను సిద్ధం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రచార సభలు నిర్వహిస్తున్న విజయ్, కరూర్ ఘటనతో ప్రచారం తాత్కాలికంగా విరమించారు. మళ్లీ వచ్చే నెల నుంచి ప్రచారం ప్రారంభించేందుకు సన్నాహాలు చేపట్టారు. ఈ నేపథ్యంలో పుదుచ్చేరిలో డిసెంబరు 5వ తేది విజయ్ పర్యటించనున్నారు. ఈ మేరకు పుదుచ్చేరి ఉప్పలం, సోనాంపాళయం వాటర్ ట్యాంక్ ప్రాంతంలో విజయ్ ప్రసంగించనున్నారని అందుకు అనుమతించాలని కోరుతూ పుదుచ్చేరి టీవీకే నేతలు రాష్ట్ర డీజీపీకి దరఖాస్తు చేసుకున్నారు.

ఆరుద్ర గోల్డ్ కార్యాలయాల్లో ఈడీ తనిఖీలు

ప్యారీస్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక అమింజికరై కేంద్రంగా ఆరుద్ర గోల్డ్ ట్రేడింగ్ అనే పేరుతో నిర్వహించిన ఫైనాన్స్ సంస్థలో రూ.2,438 కోట్లకు పైగా మోసం జరిగిందనే ఆరోపణల నేపథ్యంలో సంస్థకు చెందిన 15 కార్యాలయాల్లో ఈడీ అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. స్థానిక అమింజికరై కేంద్రంగా ఆరుద్ర గోల్డ్ ట్రేడింగ్ అనే పేరుతో నిర్వహించిన ఫైనాన్స్ సంస్థలో రూ.లక్ష డిపాజిట్ చేస్తే వడ్డీకింద రూ.36వేలు చెల్లిస్తామని ప్రకటించారు. దీనిని నమ్మి చెన్నై, కాంచీపురం, చెంగల్పట్టు, తరువళ్లూరు, తిరువణ్ణామలై, తిరుపత్తూరు, వేలూరు జిల్లాలకు చెందిన 9వేల మందికి పైగా ఆ సంస్థలో పెద్దమొత్తంలో డిపాజిట్ చేశారు. సంస్థ ఇచ్చిన మాట ప్రకారం 2 నెలల వరకు డిపాజిట్‌దారులకు అదనపు వడ్డీ చెల్లించి ఆ తర్వాత బోర్డు తిప్పేసినట్లు బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేంద్ర ఆర్థిక నేర విభాగం పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఆ సంస్థ డైరెక్టర్లు 16 మందిపై కేసు నమోదు చేసిన పోలీసులు సంస్థ డైరెక్టర్లు, మేనేజింగ్ డైరెక్టర్ రాజశేఖర్, ఏజెంట్లు తదితరులను అరెస్ట్ చేశారు. ఈ కేసులో సంబధాలున్న సినీనటుడు, నిర్మాత ఆర్‌కే.సురేష్‌ను విచారించారు. బుధవారం ఉదయం ఒకే సమయంలో సంస్థ ప్రధాన కార్యాలయం, విల్లివాక్కంలో ఉన్న డైరెక్టర్ రాజశేఖర్ ఇల్లు మడిపాక్కంలోని ఉద్యోగి మోహన్ ఇల్లుతో పాటు మొత్తం 15 ప్రాంతాల్లో తనిఖీ చేశారు. చట్టవిరుద్ధంగా పలు సంస్థల్లో పెట్టుబడులకు సంబంధించిన దస్తావేజులు, భూములు కొనుగోలు చేసిన దస్తావేజులు తదితరాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

మదురై మెట్రో ప్రాజెక్టుపై మీరేమంటారు?

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసు



పెరంబూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మదురైలో మెట్రోరైల్ ప్రాజెక్ట్ అమలుచేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై మద్రాస్ హైకోర్టు స్పందించింది. ఈ వ్యవహారంలో అభిప్రాయాలు చెప్పాలంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించి, తదుపరి విచారణను డిసెంబరు 16వ తేదీకి వాయిదా వేసింది. మదురైలో మెట్రోరైల్ ప్రాజెక్టు అమలు చేసేలా కేంద్రప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ మదురై ఒత్తకడైకి చెందిన ఆర్వీ కదిర్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై బుధవారం న్యాయమూర్తులు జస్టిస్ అనితా సుమంత్, జస్టిస్ కుమరప్పన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. కోవై, మదురైలో మెట్రో రైల్ ప్రాజెక్ట్ అమలుచేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర నివేదిక తయారుచేసి కేంద్ర ప్రభుత్వానికి పంపిందన్నారు. కానీ, ఆ నివేదికను కేంద్ర ప్రభుత్వం తిప్పి పంపిందన్నారు. మెట్రోరైలు నిబంధనల ప్రకారం 20 లక్షలు, అంతకు మించి జనాభా ఉన్న నగరాల్లో మాత్రమే అమలుచేయగలమని, 2011వ జనాభా లెక్కల ప్రకారం మదురై నగరంలో నివసిస్తున్న జనాభా సంఖ్య 15 లక్షలు మాత్రమే ఉన్నందున అక్కడ ఆ ప్రాజెక్టును అమలు చేయలేమని కేంద్రప్రభుత్వం ప్రకటించిందని గుర్తుచేశారు. కానీ, 2011 జనాభా లెక్కలు 14 ఏళ్ల క్రితం నాటివని, మదురై జిల్లాలో ప్రస్తుతం 27,29,671 మంది ఓటర్లున్నారని తెలిపారు. అలాగే, 18 ఏళ్ల తక్కువ వయసు కలిగిన వారు, వలసదారులు, పర్యాటకులు, నమోదుకాని నివాసితులను కలుపుకుంటే, మదురై జనాభా 20 లక్షలకు పైగా ఉంటుందని తెలిపారు. ఈ కారణంగా, మదురై మెట్రోరైల్ ప్రాజెక్ట్ వివరణాత్మక ప్రాజెక్ట్ నివేదికను సరిచేసి కేంద్ర ప్రభుత్వానికి తిరిగి పంపేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని, రాష్ట్ర ప్రభుత్వ ప్రాజెక్ట్ నివేదికను సమీక్షించి మదురై మెట్రోరైల్ ప్రాజెక్ట్ అమలుచేసేలా కేంద్రప్రభుత్వాన్ని ఆదేశించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ.. నిబంధనల మేరకుక ప్రాజెక్టును అమలు చేయలేమని కేంద్రం ప్రకటిస్తే, దానిని అమలు చేయాల్సిందేనని తామెలా చెప్పగలమని ప్రశ్నించింది. ఈ వ్యవహారంలో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు తమ అభిప్రాయాన్ని తెలపాలని ఆదేశించింది.

పేదలకు సాయం చేయండి

- పార్టీ శ్రేణులకు ఉదయనిధి పిలుపు
- నేడు డిప్యూటీ సీఎం జన్మదినం కోసం డీఎంకే శ్రేణుల ఏర్పాట్లు



ప్యారీస్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్-దుర్గా దంపతుల కుమారుడు డిప్యూటీ సీఎం ఉదయనిధి గురువారం 49వ వడిలోకి అడుగిడుతున్న సందర్భంగా డీఎంకే శ్రేణులు కోలాహలంగా సంబరాలకు ఏర్పాట్లు చేపట్టాయి. రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించి బడుగు, బలహీన వర్గాలకు నూతన వస్త్రాలు, కిరాణా సరుకులు తదితరాలు పంపిణీ చేయనున్నారు. ఈ నేపథ్యంలో తన పుట్టిన రోజు దివ్యాంగులు, దారిద్ర్యరేఖకు దిగువన చేరుకున్న ప్రజలకు వస్తు, ధన రూపేనా సాయం చేయాల్సిందిగా డీఎంకే జిల్లా కార్యదర్శులు, నిర్వాహకులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, స్థానిక సంస్థల ప్రతినిధులకు ఉదయనిధి పిలుపునిచ్చారు. సహాయ కార్యక్రమాలు నిర్వహించనున్న ప్రాంతాల్లో రాష్ట్రప్రభుత్వం అమలుపరుస్తున్న పథకాలు, డీఎంకే సిద్ధాంతాలను విస్తృతంగా ప్రచారం చేయాల్సిందిగా ఆయన కోరారు. యువజన విభాగం ప్రతినిధులు సేవా కార్యక్రమాల్లో తప్పనిసరిగా పాల్గొనాలని, ద్రావిడ మోడల్ డీఎంకే ప్రభుత్వం వచ్చే ఏడాది మళ్లీ అధికారంలోకి వచ్చేలా సైనికుల్లా పనిచేయాలని ఉదయనిధి తన పుట్టినరోజు సందర్భంగా డీఎంకే శ్రేణులను కోరారు.

ఎమ్మెల్యే పదవికి సెంగోట్టయ్యన్ రాజీనామా

- ఉదయం మంత్రి శేఖర్‌బాబుతో.. సాయంత్రం విజయ్‌తో భేటీ

చెన్నై, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే అధినేత ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్)పై తిరుగుబావుటా ఎగురవేసిన ఆ పార్టీ సీనియర్ నేత కేఏ సెంగోట్టయ్యన్ తన శాసనసభ్యత్వానికి రాజీనామా చేశారు. బుధవారం ఉదయం సచివాలయంలో స్పీకర్ అప్పావును కలిసి రాజీనామా పత్రాన్ని అందజేశారు. దీంతో ఆయన టీవీకే తీర్థం పుచ్చుకోవడానికి రంగం సిద్ధమైంది. అన్నాడీఎంకే నుంచి విడిపోయిన ఓపీఎస్, శశికళ తదితర నాయకులందరినీ పార్టీలో విలీనం చేయడానికి సెంగోట్టయ్యన్ చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో ఆయన తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. బహిష్కృతనేతలందరినీ పార్టీలో చేర్చుకోవాలంటూ అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామికి పది రోజుల గడువు కూడా ఇచ్చారు. చివరకు ఈపీఎస్ ఆయన్ని పార్టీ నుండి డిస్మిస్ చేశారు. ఈ నేపథ్యంలో ఆయన బీజేపీ, టీవీకే నేతలతో మంతనాలు జరిపారు. చివరకు టీవీకే నుంచి గ్రీన్ సిగ్నల్ రావటంతో సెంగోట్టయ్యన్ బుధవారం ఉదయం తన శాసనసభ్యత్వానికి రాజీనామా చేసినట్లు తెలిసింది.

శాసనసభ్యత్వానికి రాజీనామా చేసిన తర్వాత సెంగోట్టయ్యన్.. అసెంబ్లీ ప్రాంగణంలో వున్న మంత్రి పీకే శేఖర్‌బాబు ఛాంబర్‌కు వెళ్లి అరగంటకు పైగా ఆయనతో మంతనాలు జరిపారు. దీంతో ఆయన డీఎంకేలో చేరతారని అంతా భావించారు. కానీ సాయంత్రానికల్లా సెంగోట్టయ్యన్ టీవీకే నేత విజయ్‌తో భేటీ అయ్యేందుకు పట్టినంబాక్కంలో ఉన్న ఆయన నివాసానికి వెళ్లారు. విజయ్ నివాసంలో సెంగోట్టయ్యన్ రెండు గంటలకు పైగా చర్చించారు. పార్టీ ప్రముఖులు బుస్సీ ఆనంద్, ఆదవ్ అర్జునా, నిర్మల్ కుమార్ కూడా ఈ భేటీలో పాల్గొన్నారు. అనంతరం గురువారం సెంగోట్టయ్యన్ తమ పార్టీలో చేరనున్నట్లు టీవీకే వర్గాలు పేర్కొన్నాయి. దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎంజీఆర్ అన్నాడీఎంకే ప్రారంభించినప్పటి నుండి సెంగోట్టయ్యన్ ఆ పార్టీలో కీలక పాత్ర పోషించారు. మాజీ ముఖ్యమంత్రి జయలలితకు కుడిభుజంగా వ్యవహరించారు. రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఒకే నియోజకవర్గంలో ఎక్కువ సార్లు (8సార్లు) గెలిచిన నేతగా సెంగోట్టయ్యన్ రికార్డు సృష్టించారు. ప్రస్తుతం సెంగోట్టయ్యన్ టీవీకేలో చేరనుండటంతో ఆ పార్టీలో అనుభవం కలిగిన రాజకీయ నేతలెవరూ లేరన్న కొరత తీరినట్లయ్యింది.



సచివాలయంలో స్పీకర్ అప్పావుకు రాజీనామా లేఖ అందజేస్తున్న ఎమ్మెల్యే సెంగోట్టయ్యన్

సమాచార దర్శిని

పీహెచ్‌డీ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యా సంవత్సరం (2026)లో పీహెచ్‌డీ అడ్మిషన్లకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మేరకు తమిళనాడు ఉపాధ్యాయ విద్య విశ్వవిద్యాలయం విడుదల చేసిన ప్రకటనలో వివరాలిలా ఉన్నాయి. వర్శిటీ ప్రాంగణం, అనుబంధ కళాశాలల్లో 2026వ విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని తెలిపారు. అభ్యర్థులు www.tnteu.ac.in అనే వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకుని, పూర్తిచేసి డిసెంబరు 5వ తేదిలో తగిన సర్టిఫికెట్లతో సమర్పించాలని వర్శిటీ ప్రకటనలో తెలిపింది.

అరియర్ విద్యార్థులకు ప్రత్యేక ఎంఎల్ పరీక్ష

పెరంబూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఫిబ్రవరిలో నిర్వహించనున్న ఎంఎల్ ప్రత్యేక పరీక్షకు అరియర్స్ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని మద్రాసు విశ్వవిద్యాలయం ప్రకటించింది. ఈ మేరకు వర్శిటీ రిజిస్ట్రార్ రీటా జాన్ విడుదల చేసిన ప్రకటనలో... మద్రాసు వర్సిటీలో 2020-21 బ్యాచ్ విద్యార్థులకు 2025 డిసెంబరు ఎంఎల్ ప్రత్యేక పరీక్ష (అరియర్) వచ్చే ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించనున్నామన్నారు. అరియర్ విద్యార్థులు www.unom.ac.in అనే వెబ్‌సైట్‌లో ఈ నెల 28వ తేది దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. నిర్ణీత గడువులోపు దరఖాస్తులు సమర్పించలేని విద్యార్థులు, జరిమానాతో డిసెంబరు 10వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలని వర్శిటీ రిజిస్ట్రార్ తెలిపారు.

గ్రామ సహాయకుల రాత పరీక్ష వాయిదా

తిరువళ్లూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా వ్యాప్తంగా నిర్వహించాల్సిన గ్రామ సహాయకులు రాత పరీక్షను తాత్కాలికంగా వాయిదా వేశారు. తిరువళ్లూరు జిల్లా రెవిన్యూ డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న 151 గ్రామ సహాయకుల పోస్టుల భర్తీకి జిల్లా యంత్రాంగా నోటిఫికేషన్ విడుదల చేసింది. మూడేళ్లుగా ఖాళీగా ఉన్న ఈ పోస్టులకు అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, రాత పరీక్ష ఈ నెల 29వ తేది ఉదయం నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో అనివార్య కారణాల వల్ల పరీక్షను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు జిల్లా యంత్రాంగం ఒక ప్రకటనలో తెలిపింది. తదుపరి పరీక్ష నిర్వహించే తేది త్వరలో ప్రకటిస్తామని అధికారులు తెలిపారు.

సమ్మెలో పాల్గొన్న వారి ఒకరోజు జీతం కోత

పెరంబూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పలు సమస్యల పరిష్కారం కోరుతూ జాక్టో-జియో ఆధ్వర్యంలో ఈ నెల 18న విధులు బహిష్కరించి సమ్మె చేపట్టారు. ఈ సమ్మెలో పాల్గొనే ఉద్యోగులు, ఉపాధ్యాయులు వేతనం కట్ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం హెచ్చరించింది. కానీ, ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఈ సమ్మెలో పాల్గొన్నారు. ఈ సమ్మెపై అధికారులు చేపట్టిన పర్యవేక్షణలో 49,722 మంది పాల్గొన్నట్లు గుర్తించారు. వారికి 'పని చేయకుంటే వేతనం లేదు' అనే నిబంధన ప్రకారం, ఒకరోజు వేతనాన్ని కట్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

తాలూకా స్థాయిలో మినీ రైతు బజార్లు

పెరంబూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు తక్కువ ధరకు కాయగూరలందించేలా, రాష్ట్ర వ్యాప్తంగా తాలూకా స్థాయిలో ఒక మినీ రైతు బజార్ ఏర్పాటుకానుంది. ఈ రైతు బజార్ ఏర్పాటుకు అవసరమైన స్థలాలు ఎంపిక చేయాలని సహకార సంఘాల అధికారులకు సహకార శాఖ సూచించింది. రాష్ట్రంలో రైతుల నుంచి నేరుగా కాయగూరలు, ఆకుకూరలు కొనుగోలు చేసి, ప్రజలకు తక్కువ ధరకు అందించేలా ఒక్కో తాలూకాలో 'మినీ రైతు బజార్' ఏర్పాటుచేయాలని సహకార శాఖ నిర్ణయించింది. ఈ పనులు గత ఏడాది ప్రారంభించాలని నిర్ణయించగా, సీఎం ఫార్మశీల పనులకు ప్రాధాన్యత ఇవ్వడంతో, మినీ రైతు బజార్ పథకం వాయిదాపడింది. ప్రస్తుతం ఈ పనులు మళ్లీ ప్రారంభించారు. 20 దుకాణాలు ఏర్పాటుకానున్నాయి. అందుకు అవసరమైన స్థలాలు ఎంపిక చేసే పనులు ప్రారంభించాలని అధికారులకు సహకార శాఖ సూచించింది.

హోంగార్డు పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై హోంగార్డు విభాగంలో చేరేందుకు ఆసక్తి ఉన్న పురుషులు, స్త్రీలు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మేరకు సైదాపేట పోలీస్ స్టేషన్ కాంప్లెక్స్ ప్రాంగణంలోని గ్రేటర్ చెన్నై హోంగార్డ్ కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. జీసీసీ పరిధిలోని 2025 అక్టోబరు 1వ తేది నాటికి 18 ఏళ్లు పూర్తయి 50 ఏళ్లలోపున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుదారులకు ఎలాంటి నేరచరిత్ర, క్రిమినల్ కేసులు ఉండకూడదు.. 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు, కాని వారు కూడా అర్హులు. ఎంపిక చేసిన వారికి 45 రోజులు (రోజుకు ఒక గంట) శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న వారిని వారి వారి ప్రాంతాల పోలీసు స్టేషన్లలో నియమించనున్నారు. వారికి ప్రోత్సాహక వేతనంగా రూ.560 అందించనున్నారు. ఆసక్తి కలిగిన వారు డిసెంబరు 15వ తేదిలోగా జొర్భుజ్బటచీభీచిజిఖిఇఃజుభ్బుజీజూ.భొరు అనే ఈ-మెయిల్ ద్వారా, సైదాపేటలోని హోంగార్డు కార్యాలయాన్ని నేరుగా సంప్రదించి దరఖాస్తులు అందించవచ్చు. మరిన్ని వివరాలకు 9176099249, 7418681700 అనే నెంబర్లు సంప్రదించవచ్చు.

కోవైలో ఓపీఎస్‌కు ఆయుర్వేద చికిత్స

అడయార్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్ సెల్వం (ఓపీఎస్) కోయంబత్తూర్‌లో ఆయుర్వేద చికిత్స పొందుతున్నారు. కోవై గణపతిలోని ప్రకృతి చికిత్సా కేంద్రానికి వెళ్లి చికిత్స చేయించుకుంటుంటారు. ఈ క్రమంలో చెన్నై నుంచి ఓపీఎస్ మంగళవారం విమానంలో కోవై చేరుకున్నారు. అనంతరం గణపతిలోని ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందారు. ఓపీఎస్‌కు ఆరు రోజులు చికిత్స అందించనున్నట్లు ఆస్పత్రి వైద్యులు తెలిపారు.

ఉత్తరాది వారికి ఇక్కడ ఓటు హక్కా?

● డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత



ప్రచార సభలో ప్రసంగిస్తున్న ప్రేమలత

పెరంబూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాది వాసులకు రాష్ట్రంలో ఓటు హక్కు కల్పించరాదని డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత డిమాండ్ చేశారు. 'ఉల్లం తేడి ఇల్లం నోడి' అనే పేరుతో డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత రాష్ట్రవ్యాప్త ప్రచారం చేపట్టారు. ఆ ప్రకారం, మంగళవారం రాత్రి నీలగిరి జిల్లా కున్నూర్‌కు చేరుకున్న ఆమెకు కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి పడుగర్ వర్గానికి చెందిన వారి నివాస ప్రాంతాల్లో పర్యటించిన ప్రేమలత, పడుగర్ మహిళలతో కలసి సంప్రదాయ నృత్యం చేశారు. ఈ సందర్భంగా ప్రేమలత మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో ఉత్తరాది వాసులకు ఓటు హక్కు కల్పిస్తే, రాష్ట్ర ప్రజలు తిరుగుబాటు చేస్తారన్నారు. ఉత్తరాది రాష్ట్రాల వారు ఉపాధి కోసం రాష్ట్రానికి వచ్చేందుకు అభ్యంతరం లేదని, కానీ వారి ఓటు హక్కు వారి రాష్ట్రంలోనే ఉండాలన్నారు. కడలూరులో జనవరి 9న కనివినీ ఎరుగని రీతిలో డీఎండీకే రాష్ట్ర మహానాడు నిర్వహించనున్నామన్నారు. 'ప్రజల హక్కులు కాపాడే మహానాడు 2.0' పేరుతో నిర్వహించనున్న ఈ మహానాడులో, రాబోయే శాసనసభ ఎన్నికల్లో కూటమి ఏర్పాటుపై స్పష్టమైన నిర్ణయాలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలోని 234 నియోజకవర్గాల్లో డీఎండీకే బలంగా ఉందని ప్రేమలత తెలిపారు.

పీజీ వైద్య కోర్సుల ఫీజుల వివరాలు

పెరంబూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎండీ, ఎంఎస్ తదితర పోస్ట్‌గ్రాడ్యుయేట్ (పీజీ) కోర్సులు, డిప్లొమో కోర్సుల్లో 5,000లకు పైగా సీట్లున్నాయి. పీజీ కోర్సులు అడ్మిషన్ కౌన్సెలింగ్ నిర్వహించే ముందు ట్యూషన్ ఫీజు, విద్యార్థుల ప్రోత్సాహకాలు, హాస్టల్ ఫీజు, డిపాజిట్లు, ఇతర ఖర్చుల వివరాలు ప్రకటించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఆ ప్రకారం రాష్ట్రంలోని అన్ని పీజీ వైద్య కోర్సుల ఫీజుల వివరాలను వైద్య విద్య డైరెక్టరేట్ విడుదల చేసింది. అందులో హాస్టల్, భోజనం, రవాణా తదితర ఫీజులు సంబంధిత విద్యాసంస్థలు నిర్ణయించనున్నాయి. ప్రస్తుత విద్యాసంవత్సరంలో అన్ని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పీజీ వైద్య కోర్సుకు సంవత్సరానికి రూ.40,000 ట్యూషన్ ఫీజు, రూ.10,000 ప్రత్యేక ఫీజుగా నిర్ణయించారు. పీజీ డిప్లొమో కోర్సుకు ట్యూషన్ ఫీజుగా రూ.20వేలు నిర్ణయించారు. పీజీ వైద్య విద్యార్థుల స్టైఫండ్ మొదటి సంవత్సరం రూ.54,025, రెండో ఏడాది రూ.55,149, మూడో సంవత్సరం రూ.56,275గా ప్రకటించారు. పీజీ డిప్లొమో విద్యార్థుల స్టైఫండ్ మొదటి సంవత్సరం రూ.50,673, రెండో సంవత్సరం రూ.53,461గా నిర్ణయించారు. రాష్ట్రంలోని 21 ప్రైవేటు వైద్యకళాశాలల ఫీజుల వివరాలు కూడా వెల్లడించారు. రోగుల చికిత్స అందించేందుకు ప్రత్యక్షంగా సంబంధం లేని పాఠ్యాంశాలు, డిప్లొమో కోర్సులకు ప్రభుత్వ కోటా రూ.3 లక్షలు, మేనేజ్‌మెంట్ సీట్లకు రూ.5 లక్షలు, ఎన్ఆర్ఐ సీట్లకు రూ.19 లక్షలుగా నిర్ణయించారు. క్లినికల్ కోర్సుల ఫీజులు రూ.3.5 లక్షలు, రూ.16 లక్షలు, రూ.29 లక్షలుగా నిర్ణయించారు. ఇవి మినహా, ప్రైవేటు విద్యాసంస్థలు అభివృద్ధి నిధులుగా రూ.60వేలు వసూలుచేసుకునేందుకు అనుమతించారు.

● కరూర్ దుర్ఘటన

సోషల్ మీడియా, సీఐల విచారణ

పెరంబూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కరూర్ తొక్కిసలాట వ్యవహారానికి సంబంధించి సీబీఐ విచారణకు సీఐ మణివన్నన్ సహా ఐదుగురు బుధవారం హాజరయ్యారు. కరూర్ వేలుచామిపురం ప్రాంతంలో గత సెప్టెంబరు 27న టీవీకే అధ్యక్షుడు విజయ్ ప్రచార సభలో తొక్కిసలాట జరిగి 41 మంది మృతిచెందారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులతో, గత నెల 19వ తేది నుంచి సీబీఐ విచారణ ప్రారంభించింది. రెండు రోజులుగా టీవీకే ప్రధాన కార్యదర్శి ఆనంద్, రాష్ట్ర నిర్వాహకులు అదవ అర్జునన్, నిర్మల్ కుమార్ తదితరులను విచారించారు. అనంతరం కరూర్ నగర సీఐ మణివన్నన్, తొక్కిసలాట ఘటనకు సంబంధించి సామాజిక మాధ్యమాల్లో వీడియోలు పోస్ట్ చేసిన కోవై జిల్లాకు చెందిన హిందుస్తాన్ జనతా పార్టీ నేత రాహుల్ గాంధీ, కరూర్ టెక్స్ పారిశ్రామికవేత్త సెంథిల్ కుమార్, నొయ్యల్ ప్రాంతానికి చెందిన రైతు గోకులకన్నన్, ఓడువందూర్ దేశీయ ముర్పోకు ద్రావిడ కళగం కార్యదర్శి నవలడి తదితరులు బుధవారం ఉదయం సీబీఐ అధికారుల విచారణకు హాజరయ్యారు. కాగా, ఇప్పటికే ఘటన జరిగిన సమయంలో ఆ ప్రాంతంలో ఉన్న అంబులెన్స్ డ్రైవర్లు, వాటి యజమానులు, పోలీసులు, ఘటనలో గాయపడిన వారు, మృతుల కుటుంబాలకు సీబీఐ అధికారులు విచారించిన విషయం తెలిసిందే.

చెట్టు నరికివేతపై గ్రామస్తుల ఫిర్యాదు



అధికారులకు ఫిర్యాదు అందిస్తున్న గ్రామస్తులు

తిరుత్తణి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు పరిధిలోని చిత్తూరు రోడ్డులో ఓ వ్యక్తి భారీ వేపచెట్టు నరికేశాడని గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. చిత్తూరు రోడ్డులోని ప్రభుత్వ స్థలంలో సుమారు 50యేళ్ల వయసున్న వేపచెట్టును అదేప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి తన ఇంటికి అడ్డుగా ఉందన్న కారణంతో సోమవారం నరికించాడు. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు ఆ చెట్టు చాలా యేళ్లనుండి ఆ ప్రాంతంలో ఉందని అతడితో వాగ్వాదానికి దిగడంతో పాటు పళ్లిపట్టు పంచాయతీ నిర్వాహణాధికారికి బుధవారం ఉదయం ఫిర్యాదు చేశారు. దీనిపై పర్యావరణాన్ని పరిరక్షించే చెట్టును అనవసరంగా నరికి వేసినందుకు పోలీసులు సోమశేఖర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

సర్వసభ్య మండలిలో చేయాల్సిన తీర్మానాలేంటి..?

● అన్నాడీఎంకే నేతల చర్చ



ఎంజీఆర్‌మాళిగైలో చర్చలు జరుపుతున్న ఆ పార్టీ సీనియర్ నేతలు

చెన్నై, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో త్వరలో జరుగనున్న అన్నాడీఎంకే సర్వసభ్యమండలి సమావేశంలో చేయాల్సిన ప్రధానమైన తీర్మానాల రూపకల్పనపై ఆ పార్టీ సీనియర్ నేతలు బుధవారం ఉదయం భేటీ అయ్యారు. రాయపేటలోని అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయం 'ఎంజీఆర్ మాళిగై'లో ఈ సమావేశం జరిగింది. డిసెంబర్ 10న అన్నాడీఎంకే సర్వసభ్యమండలి సమావేశం ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) అధ్యక్షతన జరుగనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈపీఎస్ ఆదేశం మేరకు సర్వసభ్యమండలి తీర్మానాలను రూపొందించేందుకు అన్నాడీఎంకే సీనియర్ నాయకులంతా సమావేశమయ్యారు. ఈ సమావేశంలో అన్నాడీఎంకే నేతలు ఎస్పీ వేలుమణి, పొల్లాచ్చి జయరామన్, డి. జయకుమార్, సీవీ షణ్ముగం, సెమ్మలై, ఓఎస్ మణియన్, ఆర్బీ ఉదయకుమార్, అగ్రి కృష్ణమూర్తి, వైగై సెల్వన్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పంటల దిగుబడి పోటీలు

● మొదటి బహుమతి రూ.5 లక్షలు

పెరంబూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు వరి సాగులో అధిక దిగుబడి పోటీలు నిర్వహించనున్నారు. మొదటి స్థానంలో నిలిచిన రైతుకు రూ.5 లక్షలు, బంగారు పతకం అందజేయనున్నారు. సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించేలా ప్రతి ఏడాది ఈ పోటీలు నిర్వహిస్తుంటారు. ఈ పోటీల్లో పాల్గొనే రైతు కనిష్టంగా 2 ఎకరాల్లో వరి సాగుచేయాలి. ప్రభుత్వం అనుమతించిన వరి రకాలు మాత్రమే సాగు చేస్తుండాలి. ఈ పోటీల ప్రవేశ రుసుముగా రైతులు రూ.150 చెల్లించాల్సి ఉంటుంది. భూముల యజమానులు, కౌలుకు తీసుకున్న వారు కూడా ఈ పోటీల్లో పాల్గొనవచ్చు. ఈ పోటీలో ఒకసారి విజేతగా నిలిచిన రైతు, మరో మూడేళ్లు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం లేదు. పంట కోత కోసే 15 రోజుల ముందుగా సంబంధిత తాలూకా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్‌కు తెలియజేయాలి. జేడీ పర్యవేక్షణలో కమిటీ విజేతను ఎంపిక చేస్తోంది. ఈ పోటీలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న రైతులు డిసెంబరు నెలాఖరులోగా పేర్లు నమోదుచేసుకోవాల్సి ఉంటుంది. మరిన్ని వివరాలకు తాలూకా వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయాన్ని సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

పారిశుధ్య కార్మికుల ఆందోళనకు టీవీకే మద్దతు

● మహిళా కార్మికులతో నేతల భేటీ



నిరాహార దీక్ష చేస్తున్న పారిశుధ్య కార్మికులతో చర్చలు జరుపుతున్న టీవీకే నేతలు

చెన్నై, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వివిధ డిమాండ్ల సాధన కోసం నిరాహార దీక్ష చేస్తున్న కార్పొరేషన్ పారిశుధ్య కార్మికులకు తమిళగ వెట్రి కళగం (టీవీకే) మద్దతు ప్రకటించింది. బుధవారం ఉదయం ఆ పార్టీకి చెందిన ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్, ఎన్నికల ప్రచార విభాగం ప్రధాన కార్యదర్శి ఆదవ్ అర్జునా, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి రాజ్‌మోహన్ తదితరులు అంబత్తూరులో నిరాహార దీక్ష చేస్తున్న మహిళా కార్మికులతో భేటీ అయ్యారు. కార్పొరేషన్‌లోని 5, 6 జోన్‌లలో పారిశుధ్య పనులను ప్రైవేటు సంస్థలకు అప్పగించకూడదని, మహిళా కార్మికులకు గత జూలై 31 నాటి జీతభత్యాలతో మళ్లీ పని కల్పించాలని కోరుతో ఆ జోన్‌లకు చెందిన పారిశుధ్య కార్మికులు గత 119 రోజులుగా వివిధ రకాల ఆందోళనలు జరుపుతున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆదవ్ అర్జునా మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల న్యాయమైన డిమాండ్లను ఆమోదించి సమ్మెను విరమింపజేసేందుకు డీఎంకే ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

పారిశుధ్య పనులు ప్రైవేటు పరం సరికాదు

● జీసీసీ తీరుపై అన్బుమణి ఆగ్రహం



ప్యారీస్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పారిశుధ్య పనులను దశలవారీగా ప్రైవేటు సంస్థలకు అప్పగించడం సరికాదని పీఎంకే అధ్యక్షుడు అధ్యక్షుడు అన్బుమణి పేర్కొన్నారు. జీసీసీ పరిధిలోని రాయపురం, తిరువీకానగర్ జోన్లలో పారిశుధ్య పనులను ప్రైవేటీకరణ చేయడాన్ని ఖండిస్తూ పారిశుధ్య కార్మికులు సుమారు వంద రోజులకు పైగా ఆందోళనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా అన్నానగర్, తండయార్‌పేట జోన్లలో పారిశుధ్య పనులను ఎలాంటి ప్రకటన లేకుండా ప్రైవేటు సంస్థలకు జీసీసీ కట్టబెట్టింది. ఇందుకోసం రూ.2,300కోట్లను ఆ సంస్థలకు కేటాయించింది. ఈ చర్యలను ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకే తీవ్రంగా ఖండించింది. ఆ రీతిలో పీఎంకే నేత అన్బుమణి కూడా జీసీసీ వైఖరిని బుధవారం తప్పుబట్టారు. పారిశుధ్య పనులను ప్రైవేటు సంస్థలకు అప్పగించడం వల్ల ఆ ఉద్యోగులు ఇప్పటికే తక్కువ జీతం పొందడడంతో పాటు రాయితీలు కూడా కోల్పోయి ఆందోళన బాటపట్టారని, అయినా డీఎంకే ప్రభుత్వం, జీసీసీ పట్టించుకోలేదని వ్యాఖ్యానించారు. ఇప్పటి వరకు ప్రైవేటు సంస్థలకు అప్పగించిన నాలుగు జోన్లకు సంబంధించి కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దుచేయాలని, పదేళ్లకు పైగా సర్వీసులో ఉన్న పారిశుధ్య కార్మికులను పర్మినెంటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఇద్దరి అదృశ్యం

తిరువళ్లూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు వ్యక్తులు అదృశ్యమైన ఘటన తిరువళ్లూరు జిల్లాలో చోటు చేసుకుంది. తిరువళ్లూరు జిల్లా, వెల్లనూర్, కొళమేడుకు చెందిన బాలిక (17) ఆదివారం సరుకుల కోసం బయటికి వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు మనవాలనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు యువతి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

గుమ్మిడిపూండిలో....

తిరువళ్లూరు జిల్లా, గుమ్మిడిపూండి, బాలయోగినగర్ ప్రాంతానికి చెందిన మునుస్వామి కుమారుడు శివరంజన్(44). ఈ నెల 22న ఇంటి నుండి వెళ్ళి అదృశ్యమైయ్యాడు. అన్ని చోట్లా వెతికినా ఆచూకీ తెలియక పోవడంతో ఆందోళన చెందిన మునుస్వామి సిప్కాట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా అప్పుల బాధ భరించలేకే శివరంజన్ ఇంటి నుండి వెళ్లిపోయివుంటాడనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చెవులు కోసి బంగారు కమ్మల చోరీ

పెరంబూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రెండు చెవులు కోసి బంగారు కమ్మలు ఎత్తుకెళ్లిన ఆగంతకుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. రాణిపేట జిల్లా మలైమేడు ప్రాంతానికి చెందిన సెల్లమ్మాళ్ (70) ఒంటరిగా నివసిస్తోంది. బుధవారం వేకువజామున ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఆ సమయంలో, సెల్లమ్మాళ్ ఇంట్లో ప్రవేశించిన గుర్తుతెలియని వ్యక్తులు, ఆమె చెవులు కోసి, బంగారు కమ్మలు చోరీచేసి పరారయ్యారు. చుట్టుపక్కల వారు సెల్లమ్మాళ్‌ను వాలాజాపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

వ్యభిచార నిర్వాహకుడి అరెస్ట్

పెరంబూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెరంబూర్‌లో వ్యభిచారం నిర్వహిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. గ్రేటర్ చెన్నై పోలీసు శాఖ పరిధిలో పనిచేస్తున్న వ్యభిచార నిరోధక విభాగం పోలీసులకు అందిన రహస్య సమాచారంతో, పెరంబూర్ మేల్‌పట్టి పొన్నప్పన్ వీధిలోని వాణిజ్య కాంప్లెక్స్‌లో రియల్ ఎస్టేట్ కార్యాలయంలో మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అక్కడ మహిళలు వ్యభిచారం చేస్తున్నట్లు గుర్తించారు. ఈ వ్యవహారంలో టి.నగర్‌కు చెందిన శరవణ సెల్వన్ (57)ను అరెస్ట్ చేసిన పోలీసులు, ఇద్దరు మహిళలను ప్రభుత్వం హోంకు తరలించినట్లు నగర పోలీసు శాఖ బుధవారం ప్రకటన విడుదల చేసింది.

రాయపురం మనోకు హత్యా బెదిరింపు

పెరంబూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే వ్యవస్థాపక కార్యదర్శి రాయపురం మనోకు హత్యా బెదిరింపులకు పాల్పడిన వారిపై చర్యలు చేపట్టాలని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాయపురం గత పార్లమెంటు ఎన్నికల్లో ఉత్తర చెన్నై నియోజకవర్గం నుంచి అన్నాడీఎంకే అభ్యర్థిగా పోటీ చేసి పరాజయం పొందారు. ప్రస్తుతం ఆయన చెన్నై కార్పొరేషన్‌లో కార్పొరేటర్‌గా వ్యవహరిస్తున్నారు. ఆయన బంధువు ధరణి కుమార్, రాయపురం మనో పేరు చెప్పి పలువురు పారిశ్రామికవేత్తలు, ప్రజలను డబ్బులివ్వాలని బెదిరించినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై కొద్దిరోజుల క్రితం రాయపురం మనో అతడిని మందలించాడు. ధరణి కుమార్ మళ్లీ నగదు బెదిరింపులకు పాల్పడడంతో రాయపురం మనో తీవ్రంగా మందలించగా, ధరణి కుమార్ హత్యా బెదిరింపుకు పాల్పడినట్లు తెలిసింది. ఈ విషయమై వాషర్‌మెన్‌పేట పోలీస్ స్టేషన్‌లో రాయపురం మనో ఫిర్యాదు చేశారు.

● ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసు...

బెయిల్ రద్దు కోసం పిటిషన్..3న విచారణ



బీఎస్పీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ (ఫైల్‌ఫొటో)

ప్యారీస్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసులో నిందితుల బెయిలు రద్దుచేయాలని పోలీసుశాఖ దాఖలు చేసిన పిటిషన్‌ను డిసెంబరు 3న విచారణకు స్వీకరించనున్నట్లు మద్రాస్ హైకోర్టు తెలిపింది. ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసును సీబీఐ విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు స్టే విధించిన విషయం తెలిసిందే. ఈ కేసులో రౌడీ నాగేంద్రన్ ఆయన కుమారుడు అశ్వద్ధామన్ సహా 27 మందిని పోలీసులు అరెస్ట్ చేసి పరారైన మరో ఇద్దరి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యం లో అనారోగ్యం కారణంగా ఇటీవల నాగేంద్రన్ మృతిచెందాడు. ముద్దాయిలు 12 మందికి చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్‌కోర్టు బెయిలు మంజూరు చేసింది. ఇదిలా వుండగా, ఈ కేసులో తమకు కూడా బెయిలివ్వాలని కోరుతూ రౌడీ ఆర్కాడు సురేష్ భార్య పొర్కొడి దాఖలు చేసిన పిటిషన్‌ను, 12 మందికి మంజూరు చేసిన బెయిలు రద్దు చేసిన బెయిలు ఆమ్‌స్ట్రాంగ్ భార్య పొర్కొడి దాఖలు చేసిన పిటిషన్, ఇదే అంశంపై పోలీసుల తరుపున దాఖలైన పిటిషన్లు బుధవారం న్యాయమూర్తి కె.రాజశేఖరన్ ముందుకు విచారణకు రాగా, ఇరు తరుపు న్యాయవాదులు వాదించారు. అనంతరం తదుపరి విచారణను డిసెంబరు 3వ తేదీకి వాయిదా వేస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు.

అదనపు సీట్లు, మంత్రి పదవి అడుగుతాం!

● కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజేష్‌కుమార్

చెన్నై, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గతం కంటే అధిక స్థానాల్లో పోటీ చేయడం ఖాయమని ఆ పార్టీ ఎమ్మెల్యే రాజేష్‌కుమార్ అన్నారు. నాగర్‌కోవిల్‌లో జరిగిన పార్టీ నేతల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ఓటు బ్యాంక్ క్రమంగా పెరుగుతోందని ఈ పరిస్థితులలో గతం కంటే ఎక్కువ సీట్లు కేటాయించాలని డీఎంకే అధిష్టానంపై ఒత్తిడి చేస్తామని చెప్పారు. అంతే కాకుండా దశాబ్దాల తరబడి డీఎంకేకు మిత్రపక్షంగా ఉన్నా ఇప్పటివరకు మంత్రివర్గంలో కాంగ్రెస్‌కు స్థానం కల్పించకపోవడం శోచనీయమని అన్నారు. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే కూటమి గెలిస్తే తప్పకుండా అధికారంలో భాగస్వామ్యం అడుగుతామని, మంత్రి వర్గంలో స్థానం కల్పించి తీరాల్సిందేనని పట్టుబడతామని రాజేష్‌కుమార్ పేర్కొన్నారు.

బాలికను గర్భవతిని చేసిన యువకుడి అరెస్ట్

పెరంబూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): బాలికను గర్భవతిని చేసిన యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. సేలం ఆతూర్ ప్రాంతానికి చెందిన 16 ఏళ్ల బాలిక ప్లస్ టూ చదువుతోంది. బాలిక మంగళవారం కడుపునొప్పితో బాధపడుతుండడంతో, తల్లిదండ్రులు ఆమెను ఆతూర్ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. బాలికను పరీక్షించిన వైద్యులు, ఆమె నాలుగు నెలల గర్భంతో ఉన్నట్లు నిర్ధారించారు. దిగ్భ్రాంతి చెందిన తల్లిదండ్రులు, ఆతూర్ మహిళా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసుల విచారణలో.. అదే ప్రాంతానికి చెందిన సెల్వం, వివాహం చేసుకుంటానని నమ్మించి మోసం చేసినట్లు సమాచారం. సెల్వం చెల్లెలు, బాధిత బాలిక ఒకే తరగతి చదువుతుండడంతో, చెల్లెల్ని తీసుకొచ్చేందుకు వెళ్లిన సెల్వం, బాలికతో పరిచయం పెంచుకున్నాడని తెలిసింది. ఈ వ్యవహారంపై పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసిన పోలీసులు విచారణ చేపట్టారు.

రూపాయి కూడా లేదు..ఇన్ని కెమెరాలు ఎందుకు...?

● ఇంటి యజమానికి దొంగ లేఖ

పెరంబూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఒక్క రూపాయి కూడా లేదు... ఇంటి చుట్టూ ఇన్ని కెమెరాలు ఎందుకు? అంటూ ఆవేదన వ్యక్తం చేసిన ఓ దొంగ, ఇకనైనా ఇంట్లో డబ్బు ఉంచి వెళ్లండి.. ప్లీజ్ అంటూ ఇంటి యజమానికి లేఖ రాసి వెళ్లాడు. తిరునల్వేలి జిల్లా పాతపేట ప్రాంతానికి చెంది జేమ్స్‌పాల్, తన భార్యతో కలసి ఉంటున్నాడు. మదురైలో ఉన్న తన కుమార్తెను చూసేందుకు రెండు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి వెళ్లాడు. ఘటన జరిగిన రోజు అర్ధరాత్రి తలుపులు బద్దలుకొట్టి ఇంట్లో ప్రవేశించిన దొంగ, బీరువాల సహా అన్ని ప్రాంతాల్లో వెతికినా డబ్బు, నగలు కనిపించలేదు. దీంతో ఆ దొంగ.. ఇంటి యజమానికి 4 పేజీల లేఖ రాసి వెళ్లాడు.. లేఖలో.. ఇంట్లో ఒక్క రూపాయి కూడా లేదు... అలాంటప్పుడు ఇన్ని కెమెరాలు ఎందుకు? మరోసారి నాలాగా ఎవరూ చోరీకి వచ్చి మోసపోకూడదని, దయచేసి డబ్బులు ఉంచి వెళ్లండి... నన్ను క్షమించండి అంటూ ఇంట్లో ఉన్న సీసీ టీవీ హార్డ్ డిస్క్ ఎత్తుకెళ్లాడు. ఈ వ్యవహారంపై జేమ్స్‌పాల్ ఫిర్యాదుతో పేట పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

లంచం కేసులో విద్యుత్ బోర్డు ఇంజనీర్ అరెస్ట్

ప్యారీస్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తెన్‌కాశి జిల్లా వీకే.పుదూర్ మండలం కీలవీరాణం గ్రామంలో విద్యుత్ కనెక్షన్ కోసం రూ.7వేలు లంచం పుచ్చుకున్న తమిళనాడు విద్యుత్ బోర్డు (టీఎన్ఈబీ) ఇంజనీర్ సహా ఇద్దరిని ఏసీబీ అరెస్ట్ చేసింది. కీలవీరాణం గ్రామం కామాక్షి అమ్మన్ అమ్మవారి ఆలయ వీధికి చెందిన కరుప్పస్వామి కుమారుడు సెల్వగణేష్ వీకే.పుదూరులో ఉన్న స్థలానికి నూతన విద్యుత్ కనెక్షన్ కోరుతూ 2020వ సంవత్సరం దరఖాస్తు చేసుకున్నారు. విద్యుత్ కనెక్షన్‌కు తనకు రూ.10వేలు లంచంగా ఇవ్వాలంటూ టీఎన్ఈబీ ఇంజనీర్ ప్రేమానంద్ డిమాండ్ చేశారు. దీనిపై ఏసీబీ పోలీసులకు సమాచారం తెలియజేసి ఈ నెల 24న పోలీసుల సూచనల మేరకు రసాయనం పూసిన రూ.7వేల కరెన్సీ ఇంజనీర్ ప్రేమానంద్ స్వీకరిస్తుండగా అక్కడే నిఘా వేసిన ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ వ్యవహారంలో అతని మిత్రుడు దురై (43)ను కూడా అరెస్ట్ చేశారు.

పుళల్ జైలులో గంజాయి స్వాధీనం

అడయార్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక పుళల్ కేంద్ర కారాగారంలో ఖైదీల నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ జైలులో ఖైదీలు గంజాయి, సెల్‌ఫోన్, బీడీ, సిగిరెట్ తదితరాలు వినియోగాన్ని అడ్డుకొనేలా జైలు అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపడుతుంటారు. ఈ క్రమంలో, మంగళవారం సాయంత్రం జైలు అధికారులు ఖైదీల గదుల్లో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో, మైలాపూర్‌కు చెందిన చరణ్ అనే ఖైదీలో దుస్తుల్లో దాచిన 10 గ్రాములు, మరో గదిలో పులియాంతోపుకు చెందిన ఖైదీ సంతోష్ వద్ద 20 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జైలు అధికారుల ఫిర్యాదుతో పుళల్ పోలీసులు, వేర్వేరు కేసు నమోదుచేసి విచారిస్తున్నారు.

తిరునల్వేలి జిల్లాలో 75వేల ఓట్ల తొలగింపు

అడయార్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి జిల్లాలో మృతి చెందిన వారు, చిరునామా తెలియని వారు మొత్తం 75వేల ఓట్లు తొలగించే అవకాశముందని జిల్లా కలెక్టర్ సుకుమార్ తెలిపారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... అర్హులైన ఓ ఒక్క ఓటు కూడా తొలగించమని, అదే సమయంలో అర్హత లేని వారి పేర్లు తొలగిస్తామని తెలిపారు. జిల్లాలో మంగళవారం సాయంత్రం వరకు 7,27,583 (51.30 శాతం) ఫారాలు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశామని తెలిపారు. జిల్లాలో 54,913 మంది మృతి చెందారని, 1,195 మంది నిర్ణీత చిరునామాలో లేరని, మరో 18,933 మంది శాశ్వతంగా వెళ్లిపోయారని, ఈ కారణంగా 75,041 మందిని ఓటర్ల జాబితా నుంచి తొలగించే అవకాశముందని కలెక్టర్ తెలిపారు.

ఇస్రో ప్రాంగణంలో సీఐఎస్ఎఫ్ జవాను ఆత్మహత్య

అడయార్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి ఇస్రో కేంద్రంలో సీఐఎస్ఎఫ్ జవాను ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఒడిశా రాష్ట్రానికి చెందిన దర్పదాలాపూ (28) కేంద్ర పారిశ్రామిక భద్రతా విభాగం (సీఐఎస్ఎఫ్)లో 2021 నుంచి పనిచేస్తున్నాడు. ప్రస్తుతం తిరునల్వేలి జిల్లా కావల్‌కినరు ఇస్రో కేంద్రంలో విధులు నిర్వహిస్తున్నాడు. సెలవుల నిమిత్తం స్వరాష్ట్రానికి వెళ్లిన అతను, కొద్దిరోజుల క్రితం తిరిగి వచ్చాడు. ఈ క్రమంలో, మంగళవారం ఉదయం తన గదిలోని ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.



కొత్త చిత్రం ప్రారంభోత్సవంలో సూర్యదేవి తదితరులు

హీరోయిన్‌గా నిర్మాత...

తాను నిర్మించే చిత్రంలో నిర్మాతే హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఆమె పేరు సూర్యదేవి. సంతోష్ ప్రతాప్, ప్రవీణ్ వారోలుగా నటించే ఈ చిత్రంలో ఒక కథానాయికగా ఆమెనే ఎంపిక చేశారు. సినిమా టూర్ ఎంటర్‌టైన్మెంట్, బి స్ప్రైర్ ఎంటర్‌టైన్మెంట్ సంయుక్తంగా 'ప్రొడక్షన్ నెం.1' అనే వర్కింగ్ టైటిల్‌తో కొత్త చిత్రానికి శ్రీకారం చుట్టాయి. ఈ చిత్రం పూజా కార్యక్రమం నగరంలో జరిగింది. ఇందులో ప్రముఖ హాస్య నటుడు సెంథిల్ తొలి క్లాప్ కొట్టారు. నక్కీరన్, ఆనంద్ అనే ఇద్దరు దర్శకత్వం వహిస్తున్నారు. మరో హీరోయిన్‌గా ఎంపిక చేయాల్సి ఉండగా, ఇతర పాత్రల్లో జయప్రకాష్, వినోదిని, విజయ్ టీవీ ఫేం దీప, సాయిదీనా, కాలేజ్ వినోద్, ఆదిత్య టీవీ కదిర్, మదన్, మహేంద్రన్ తదితరులు నటించారు.

రివాల్వర్ రీటా పక్కా డార్క్ కామెడీ చిత్రం

● కీర్తి సురేష్

చిత్రజ్యోతి

తాను ప్రధాన పాత్రలో నటించిన 'రివాల్వర్ రీటా' చిత్రం పక్కా డార్క్ కామెడీ చిత్రం అని ప్రముఖ హీరోయిన్ కీర్తి సురేష్ అన్నారు. ఈ చిత్రాన్ని ఇంటిల్లిపాది కలిసి హాయిగా నవ్వుకుంటూ చూడొచ్చని ఆమె చెప్పారు. చంద్రు దర్శకత్వంలో తమిళం, తెలుగు, కన్నడ భాషల్లో తెరకెక్కించిన ఈ చిత్రం ఈ నెల 28న విడుదలకానుంది. దీనిని పురస్కరించుకుని సోమవారం రాత్రి నగరంలో ప్రీరిలీజ్ ఈవెంట్‌ను చిత్ర బృందం నిర్వహించింది. ఇందులో ఆమె మాట్లాడుతూ, 'దర్శకుడు చంద్రు డైరెక్టర్ వెంకట్ ప్రభు వద్ద పనిచేశారు. ఆయన కథ చెప్పిన తొలిరోజే ఇందులో నటించాలని నిర్ణయించుకున్నాను. ఈ నిర్మించేందుకు వచ్చిన ది రూట్ జగదీష్, ప్యాషన్ స్టూడియోస్ సుధన్ సుందరంలకు ధన్యవాదాలు. సీనియర్ నటి రాధికతో కలిసి తొలిసారి స్క్రీన్ షేర్ చేసుకున్నాను. ఆమె నిర్మాణంలోనే నేను తొలిసారి తమిళంలోకి ఎంట్రీ ఇచ్చాను. ఈ సినిమా ఖచ్చితంగా ప్రతి ఒక్కరూ చూసి ఆనందించండి' అని కోరారు. చిత్ర దర్శకుడు చంద్రు మాట్లాడుతూ, 'తొలుత నిర్మాతలకు ధన్యవాదాలు. లేడీ సబ్జెక్టుపై నమ్మకం పెట్టుకుని భారీ బడ్జెట్‌తో నిర్మించారు. రాధిక తల్లిపాత్ర పోషించారు. ఇది ఒక మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. ప్రతి ఒక్కరూ కుటుంబంతో కలిసి సరదాగా చూడొచ్చు' అని పేర్కొన్నారు. కీర్తి సురేష్ ప్రధాన పాత్ర పోషించిన ఈ చిత్రంలో రాధిక, సూపర్ సుబ్బరాయన్, సునీల్, అజయ్ ఘోష్, రెడిన్ కింగ్స్లీ, జాన్ విజయ్, కళ్యాణ్ మాస్టర్, సురేష్ చక్రవర్తి తదితరులు నటించారు.





'అరసన్'లో విజయ్ సేతుపతి

దర్శకుడు వెట్రిమారన్ - హీరో శింబు కాంబినేషన్‌లో రూపొందుతున్న 'అరసన్' చిత్రంలో విజయ్ సేతుపతి నటిస్తున్నారు. ఈ విషయాన్ని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. వి క్రియేషన్స్ పతాకంపై నిర్మాత కలైపులి ఎస్.థాను ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ నెల 24 నుంచి సినిమా చిత్రీకరణ ప్రారంభమవుతుదని ముందుగా ప్రకటించారు. కానీ, హీరో శింబు మరో చిత్రానికి కమిట్టై ఉండటంతో ఈ సినిమా షూటింగ్ ప్రారంభానికి ఆటంకం ఏర్పడింది. 'విడుదలై' మూవీ తర్వాత దర్శకుడు వెట్రిమారన్‌తో విజయ్ సేతుపతి ఈ చిత్రం కోసం కలిసి పనిచేయనున్నారు. అలాగే, 'సెక్క సివంద వానమ్' మూవీ తర్వాత శింబు - విజయ్ సేతుపతి కలిసి నటిస్తున్నారు.

హీరోయిన్‌గా హాస్యనటుడి కుమార్తె

ప్రముఖ హాస్య నటుడు లివింగ్‌స్టన్ కుమార్తె జోవిత హీరోయిన్‌గా ఎంట్రీ ఇస్తున్నారు. కేఎస్ కిషాన్ దర్శకత్వం వహిస్తున్న చిత్రంలో ఆమె కథానాయిక పాత్ర పోషిస్తున్నట్టు వెల్లడించారు. ఈ విషయంపై ఆమె మాట్లాడుతూ, 'నా నిరీక్షణ ఫలించింది. హీరోయిన్‌గా ఓ చిత్రంలో నటిస్తున్నాను. ఇది హార్రర్ జానర్ మూవీ. సినిమాల్లో నటించడం మా నాన్నకు ఏమాత్రం ఇష్టం లేదు. కానీ, ఆయనకు నచ్చజెప్పిన తర్వాతే సినిమాల్లోకి వచ్చాను. ఈ చిత్రంలో నాన్న కూడా ఓ పాత్ర పోషిస్తున్నారు. మేమిద్దరం ఇప్పటివరకు కలిసి నటించిన సందర్భాలు లేవు' అన్నారు. అలాగే, తన కుమార్తె సినీ రంగ ప్రవేశంపై లివింగ్‌స్టన్ మాట్లాడుతూ, 'సినిమాల్లో ఎల్లవేళలా ఒకే తరహా సక్సెస్ ఉండదు. అందుకే సినిమాకు దూరంగా ఉండాలని చెప్పాను. ఆమె గాయని కావాలని ఆశపడ్డాను. కానీ నటించాలని నిర్ణయం తీసుకుంది. మంచి కంటెంట్ కథలు విజయం సాధిస్తాయన్నారు.



జోవిత లివింగ్‌స్టన్

112 వసంతాల 'రిప్పన్ భవనం'

● నేటికీ చెక్కుచెదరని కట్టడం ● ప్రాచీన నిర్మాణశైలికి నిదర్శనం

పెరంబూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నగరంలో 'రిప్పన్ భవనం' అని పిలిచే గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) ప్రధాన కార్యాలయ భవనం బుధవారానికి 112 వసంతాలు పూర్తిచేసుకుంది. వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన ఈ భవనం నేటికి నగరానికి ఖ్యాతి చేకూరుస్తున్న భవనాల్లో ఒకటిగా పేరుగాంచింది. ఈ భవన నిర్మాణం 1909లో ప్రారంభమై 1913లో పనులు పూర్తిచేసి, నవంబరు 26న ప్రారంభించారు. ఈ భవన రూపకర్త జీఎస్టీ హారిస్ కాగా, భవనం నిర్మాణాలు చేపట్టింది నగరానికి చెందిన లోకనాథ ముదలియార్. సుమారు నాలుగేళ్ల భవన నిర్మాణాలు జరగగా, ఆరోజుల్లో భవన నిర్మాణ వ్యయం రూ.7.5 లక్షలు. అందులో, లోకనాథ ముదలియార్ రూ.5.5 లక్షలు తీసుకున్నట్లు దస్తావేజులు చెబుతున్నాయి.



ప్రత్యేక అంశాలు... : ఈ భవనం ఇండో-సారాసెనిక్ కళాత్మకతతో రూపొందించారు. మూడంతస్తుల ఈ భవనం మొత్తం విస్తీర్ణం 25,000 చ.అలతో 252 అడుగుల పొడవు, 126 అడుగుల వెడల్పుతో నిర్మితమైంది. ఈ భవనంలో 8 అడుగుల ఎత్తున గడియారం ఏర్పాటుచేశారు. ఈ భవనం ఇటుక, సున్నం, ఇసుక, కరక్కాయ నీరు, బెల్లం మిశ్రమంతో నిర్మించారు. ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేలా మెడ్రాస్ టెర్రస్ పైకప్పు ఏర్పాటు ఈ భవనం ప్రత్యేకత. భవనంలోని ప్రతి అంతస్తులతో భారీ ఇనుప స్తంభాలు, వాటి మధ్య టేకు దూలాలుంచారు. ఇప్పటికీ ఆ భవనం ప్రాచీనత చెక్కుచెదరకుండా దర్శనమిస్తోంది.

కోలాహలంగా 'నేవీ డే' వేడుకలు

అడయార్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక హార్బర్‌లో నావికా దళం (నేవీ) దినోత్సవం వేడుకలు కోలాహలంగా సాగాయి. ఇందుకోసం ఐఎన్ఎస్ హిమగ్రి, ఐఎన్ఎస్ ఉదయగిరి, ఐఎన్ఎస్ రణవీర్, ఐఎన్ఎస్ సత్పురా తదితర నాలుగు యుద్ధ నౌకలు ఇటీవల హార్బర్‌లో లంగరు వేశాయి. ఆ నౌకలను విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్లు, మాజీ సైనికులు, నావికా దళం సిబ్బంది కుటుంబ సభ్యులు మొత్తం 3,000 మంది సందర్శించారు. దేశ నావికా దళం బలం, సముద్ర సాంకేతిక నైపుణ్యాన్ని సందర్శకులు ప్రత్యక్షంగా వీక్షించారు. చిన్న ఆయుధాల నిర్వహణ, సీపీఆర్ శిక్షణ, అగ్నిమాపక పద్ధతులపై కూడా ప్రదర్శనలు అందించారని నావికా దళం ఒక ప్రకటనలో తెలిపింది.



ఉత్సవంలో పాల్గొన్న యుద్ధ నౌక

అట్టహాసంగా 'అపోలో హోమ్‌కేర్' దశమ వార్షికోత్సవం

చెన్నై, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇంటివద్దనే రోగులకు నాణ్యమైన వైద్య సేవలందించటంలో పేరున్న అపోలో హోమ్‌కేర్ దశమ వార్షికోత్సవాలు అన్నాసాలైలోని స్టార్ హోటల్‌లో బుధవారం అపోలో ఆస్పత్రుల వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ప్రతాప్ సి. రెడ్డి సమక్షంలో జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఆరోగ్యవంతమైన సమాజాన్ని రూపొందించడానికి అనువుగా దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్నవారికి, తీవ్ర రోగాలతో అస్వస్థతకు గురవుతున్నవారికి వారిళ్లవద్దే అపోలో ఆసుపత్రిలో లభించే వైద్యం అందించాలన్న సంకల్పంతో 2015లో అపోలో హోమ్‌కేర్ ప్రారంభించినట్లు తెలిపారు. గత పదేళ్లలో 10లక్షల మందికిపైగా రోగులు ఈ హోమ్‌కేర్ సేవలందుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారని ఆయన వెల్లడించారు. ప్రతి రోజూ సుమారు 2 వేల మందికి ఇంటిదగ్గరే వైద్యం అందిస్తున్నారని, తమ ఆస్పత్రి వైద్యనిపుణులు, సిబ్బంది కృషి ప్రశంసనీయమన్నారు. అపోలో హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్‌పర్సన్ డాక్టర్ ప్రీతారెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సునీతారెడ్డి, అపోలో హోమ్ హెల్త్‌కేర్ లిమిటెడ్ డైరెక్టర్ హర్షద్‌రెడ్డి, అపోలో హాస్పిటల్ డివిజన్ ప్రెసిడెంట్ డాక్టర్ మధు శశిధర్ తదితరులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.



వార్షికోత్సవాల్లో అపోలో గ్రూపు వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి, డాక్టర్ ప్రీతారెడ్డి, డాక్టర్ సునీతారెడ్డి తదితరులు

రాజ్యాంగం... దేశ అత్యున్నత చట్టం

● కస్టమ్స్ డిప్యూటీ కమిషనర్ మోహన్

ప్యారీస్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): దేశంలోని వ్యవస్థలన్నీ రాజ్యాంగంపై ఆధారపడి పనిచేస్తున్నాయని చెన్నై కస్టమ్స్ డిప్యూటీ కమిషనర్ ఎస్.మోహన్ పేర్కొన్నారు. భారత రాజ్యాంగం ఆమోదం పొంది నేటికి 76 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మద్రాస్ కస్టమ్స్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘ ఆధ్వర్యంలో హార్బర్ నియోజకవర్గంలోని కస్టమ్స్ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంగణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం ట్రెజరర్, సూపరిండెంట్ ఎంఎస్ కార్తికేయన్, ఉపాధ్యక్షులు, అప్రైజర్ పి.ఆదిలక్ష్మణ్ సారథ్యంలో, జరిగిన ఈ వేడుకల్లో ముఖ్యఅతిథిగా కస్టమ్స్ డిప్యూటీ కమిషనర్ మోహన్, ప్రత్యేక అతిథిగా అసిస్టెంట్ కమిషనర్ జీకే రాధాకృష్ణన్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు పి.ఆదిలక్ష్మణ్,ఈసీ సభ్యులు ఎండీ.ఇందిరా, బి.రమేష్‌బాబు, శశిరేఖ, ప్రేమ, మునిస్వామి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మద్రాస్ కస్టమ్స్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘ నాయకులు



విద్యార్థినులతో కలిసి బ్యాటరీ ట్రైన్ నడుపుతున్న మంత్రి నాజర్

రూ.3.01 కోట్లతో సైన్స్ పార్క్

తిరువళ్లూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు కలెక్టరేట్ ప్రాంగణంలో ప్రజా పనుల శాఖ ఆర్థిక సహకారంతో రూ.3.01 కోట్లతో నిర్మించిన సైన్స్ పార్క్‌ను బుధవారం ఉదయం రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.ఎం.నాజర్ ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ ప్రతాప్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ, సాధారణ పార్కులకు భిన్నంగా ఈ పార్కులో ఏర్పాటు చేసిన అవగాహన సిగ్నళ్లు రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు దోహద పడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థులకు అవగాహన పెంచే రీతిలో ఏర్పాటు చేసిన సైన్స్‌కు సంబంధించిన డిజైన్లు ఆసక్తి కరంగా ఉన్నాయన్నారు. వివిధ సమస్యల నిమిత్తం కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలు విశ్రాంతి తీసుకునేందుకు కూడా ఈ పార్కు ఉపయోగపడుతుందని, తక్కువ సమయంలో ఈ పార్కు నిర్మాణ పనులను పూర్తి చేయడం సంతోషకరమన్నారు. అనంతరం రూ.2.51 కోట్లతో ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి స్టడీ హాల్‌ను మంత్రి ప్రారంభించి, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులతో ముచ్చటించారు. రెవెన్యూ, విపత్తు నిర్వాహణ శాఖ తరపున 10 మందికి కార్యాలయ సహాయకులుగా, 13 మందికి కారుణ్య ప్రాతిపదికన గ్రామ సహాయకులుగా నియామక పత్రాలు ఆయన అందించారు. ఈ కార్యక్రమంలో తిరువళ్లూరు ఎమ్మెల్యే రాజేంద్రన్, ఆవడి కార్పొరేషన్ కమిషనర్ శరణ్య, జిల్లా రెవెన్యూ అధికారి సురేష్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ డైరక్టర్ జయకుమార్, ప్రజా పనుల శాఖ ఇంజనీర్ దేవన్, కలెక్టర్ కార్యదర్శి వెంకట్రామన్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వీరాణంలో 45 అడుగులు దాటిన నీటిమట్టం

చెన్నై, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లా కాట్టుమన్నార్‌కోవిల్ సమీపంలోని వీరాణం చెరువు నీటి మట్టం 45.50 అడుగులకు పెరిగింది. ఆ చెరువు పూర్తి సామర్థ్యం 47 అడుగులు. ఈ చెరువు నుండి 44,756 ఎకరాల కు సాగు నీరు విడుదల చేస్తారు. ఇదే విధంగా చెన్నై నగరవాసుల దాహార్తి తీర్చేందుకు పైప్‌లైన్ల ద్వారా నీరు విడుదల చేస్తున్నారు. గత కొద్ది రోజులుగా ఆ చెరువు పరివాహక ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా నీటిమట్టం క్రమంగా పెరుగింది. బుధవారం ఉదయం ఆ చెరువులో నీటిమట్టం 45.50 అడుగులకు చేరటంతో ఇరిగేషన్ అధికారులు చెరువు భద్రత దృష్ట్యా అదనపు జలాలను విడుదల చేస్తున్నారు.



జలకళను సంతరించుకున్న చెరువు

రూ.7 కోట్లతో వర్షపు నీటి కాలువ నిర్మాణం

తిరువళ్లూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు మున్సిపాలిటీలోని నేతాజీ రోడ్డులో రూ.7 కోట్లతో వర్షపు నీటి కాలువ నిర్మాణ పనులను చేపట్టనున్నట్లు తిరువళ్లూరు ఎమ్మెల్యే రాజేంద్రన్ ప్రకటించారు. నేతాజీరోడ్డు నుంచి కోవిల్‌కుళం రోడ్డు వరకు రహదారుల శాఖ వర్షపు నీటి కాలువ నిర్మాణ పనులు చేపట్టారు. నిర్మాణ పనులను అధికారులు, స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే రాజేంద్రన్ బుధవారం ఉదయం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తిరువళ్లూరు మున్సిపాలిటీ పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నివాస ప్రాంతాల్లోకి చేరి అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఉంగళుడన్ స్టాలిన్ కార్యక్రమంలో తనకు స్థానికుల నుంచి అర్జీలు అందాయన్నారు. దీంతో సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చి రోడ్డుకు ఇరువైపుల ఆక్రమణలను తొలగించి కాలువ నిర్మాణానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ సమస్యను రాష్ట్ర రహదారుల శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్ళి రోడ్డుకు ఇరువైపుల కాలువ నిర్మాణ పనులకు రూ.7 కోట్లు మంజూరు చేయించి పనులు ప్రారంభించామన్నారు. త్వరితగతిన కాలువ పనులను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామని ఆయన ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కార్యదర్శి కుంచ రేవంత్, మున్సిపల్ ఛైర్మన్ ఉదయమలర్ పాండియన్, డిప్యూటీ ఛైర్మన్ రవిచంద్రన్, హైవే శాఖ ఇంజనీర్ మహాలింగం, మున్సిపల్ కమిషనర్ దామోదరన్, డీఎంకే యూనియన్ కార్యదర్శి రమేష్‌తో పాటు అధికారులు, డీఎంకే నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కాలువ పనులను తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే రాజేంద్రన్



చెన్నైలోని డాక్టర్ అంబేడ్కర్ న్యాయవిశ్వవిద్యాలయంలో జరిగిన రాజ్యాంగ దినోత్సవంలో విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి

ప్రజా గ్రీవెన్స్‌కు 18 వినతులు



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న పోలీసు కమిషనర్ అరుణ్

పెరంబూర్, నవంబరు 26 (ఆంధ్ర జ్యోతి): స్థానిక వెప్పేరిలోని పోలీసు కమిషనర్ కార్యాలయంలో బుధవారం ప్రజా సమస్యల పరిష్కార శిబిరం జరిగింది. ఈ కార్యక్రమంలో పోలీసు కమిషనర్ అరుణ్ ప్రజల నుంచి 18 వినతులు స్వీకరించారు. అలాగే, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమస్యలను విచారించి సత్వరం చర్యలు చేపట్టాలని సంబంధిత స్టేషన్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. ప్రతి బుధవారం జరిగే ఈ గ్రీవెన్స్‌లో ప్రజలు పాల్గొని తమ సమస్యలు తెలిపి పరిష్కారం పొందాలని నగర పోలీసు కార్యాలయం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేసింది.

కౌన్సిలర్లుగా ఆరుగురు దివ్యాంగుల ఏకగ్రీవ ఎన్నిక

తిరువళ్లూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్సిపాలిటీ, పంచాయతీల్లో దివ్యాంగులను కౌన్సిలర్లుగా నియమించాలన్న ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు తిరువళ్లూరు మున్సిపల్ కౌన్సిలర్‌గా ప్రత్యేక ప్రతిభావంతుడు మురళి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. దివ్యాంగులను స్థానిక సంస్థల్లో ప్రజా ప్రతినిధిగా నామినేటెడ్ పద్ధతిలో అవకాశం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా వున్న పంచాయతీ, మున్సిపాలిటీల్లో కౌన్సిలర్లుగా నియమిస్తూ వస్తున్నారు. ఇందులో భాగంగా ఆవడి కార్పొరేషన్, తిరువళ్లూరు, పొన్నేరి, తిరునిండ్రవూర్, పూందమల్లి, తిరువేర్కాడు తదితర ఆరు మున్సిపాలిటీల్లో ఒకరి చొప్పున కౌన్సిలర్‌లను నియమించారు. వీరితో ఆయా మున్సిపల్ కమిషనర్లు బుధవారం ఉదయం ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా తిరువళ్లూరు మున్సిపల్ కౌన్సిలర్‌గా మురళీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మురళీ మాట్లాడుతూ, దేశ వ్యాప్తంగా ఎక్కడ దివ్యాంగులకు ఈ అవకాశం కల్పించలేదని, తమను గుర్తించినందుకు దివ్యాంగుల తరపున ముఖ్యమంత్రి స్టాలిన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని, దివ్యాంగుల సమస్యలను కౌన్సిల్ సమావేశంలో ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఛైర్‌పర్సన్ ఉదయమలర్, కమిషనర్ దామోదరన్, వైస్ ఛైర్మన్ రవిచంద్రన్, కౌన్సిలర్లు అరుణ జైకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కౌన్సిలర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న మురళి

అరుణాచలంలో నెయ్యి విక్రయ కేంద్రం ప్రారంభం

వేలూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై అన్నామలైయార్ ఆలయంలో కార్తిక దీపోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ వేడుకల్లో ముఖ్యాంశమైన మహాదీపం డిసెంబరు 3వ తేదీ వెలిగించనున్నారు. ఈ క్రమంలో మహాదీపాన్ని వెలిగించేందుకు ఆవిన్ నుంచి 41,500 కిలోల నెయ్యి హిందూ దేవాదాయశాఖ కొనుగోలు చేసింది. ఇదే కాకుండా భక్తులు దీపోత్సవంలో పాల్గొని స్వామివారికి దీపారాధన నిర్వహించేందుకు గానూ బుధవారం ఉదయం ఆలయ యాజమాన్యం నెయ్యి విక్రయ కేంద్రాన్ని ప్రారంభించింది. ఈ నేపథ్యంలో, నెయ్యి కొనుగోలు చేసేందుకు భక్తులు ఉత్సాహం చూపుతున్నారు. నగదు రూపంలోనే కాకుండా ఫోన్‌పే, జీపే తదితర ఆన్‌లైన్ మాధ్యమాల ద్వారా కూడా నెయ్యిని కొనుగోలు చేయవచ్చని ఆలయ నిర్వాహకులు తెలిపారు.



నెయ్యి విక్రయ కేంద్రం వద్ద భక్తులు





శైలేష్ కొలను - కేతిరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి

కొత్త ప్రాజెక్ట్ కోసం స్వామి ఆశీస్సులు తీసుకున్నా

తిరుమల, నవంబరు26(ఆంధ్రజ్యోతి): త్వరలో కొత్త ప్రాజెక్ట్‌ను ప్రారంభించనున్న క్రమంలో స్వామి ఆశీస్సులు తీసుకున్నానని 'హిట్' సినిమాల దర్శకుడు శైలేష్ కొలను వెల్లడించారు. తిరుమల శ్రీవారిని బుధవారం ఉదయం తన నూతన ప్రాజెక్ట్ స్క్రిప్ట్‌తో ఆయన దర్శించుకున్నారు. సితార ఎంటర్టైన్మెంట్ నాగవంశీతో నూతన సినిమా ప్రారంభంకానుందన్నారు.

● తమిళనాడు తెలుగు యువశక్తి అధ్యక్షుడు, తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్ కౌన్సిల్ అధ్యక్షుడు కేతిరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి కూడా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.

4న తిరుమలలో కార్తీక దీపోత్సవం

తిరుమల, నవంబరు26(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో డిసెంబరు 4వ తేది కార్తీక పర్వ దీపోత్సవాన్ని టీటీడీ నిర్వహించనుంది. శ్రీవారికి సాయంకాల కైంకర్యాలు, నివేదనలు పూర్తయ్యాక ఆలయంలోపల, బయట అనుబంధ ఆలయాలు, పుష్కరిణి వద్ద నేతి వత్తులతో దీపాలను వెలిగిస్తారు.

హత్యకేసులో లొంగిపోయిన నిందితుడు

పాకాల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పాకాల మండలం దామలచెరువుకు చెందిన మామిడి సప్లయర్, మెడికల్ షాప్ యజమాని ఈ యేడాది మే 1వ తేదీన దారుణహత్యకు గురైన సంఘటనలో మూడో నిందితుడు తిరుమల రాజు బుధవారం పాకాల జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో లొంగిపోయాడు. న్యాయమూర్తి పూర్ణిమాదేవి నిందితుడికి 14 రోజులు రిమాండు విధించారు. ఈ మేరకు పోలీసులు చిత్తూరు సబ్‌జైలుకు నిందితుడిని తరలించారు.


సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 4 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరిలోని 2 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.3.26 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 73,677

తలనీలాలు సమర్పించినవారు: 24,732



కాంచిన కనులదే భాగ్యం



పూలబుట్టలతో ఊరేగింపుగా టీటీడీ అధికారులు



● అమ్మవారికి వేడుకగా పుష్పయాగం

తిరుచానూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): జాజులు, తామరలు, మల్లెలు, కలువలు, చామంతి, రోజా, మొల్లలు, కనకాంబరాలు, మొగలి రేకులు తదితర 12 రకాల పుష్పాలు. తులసి, మరువం, దవణం, బిల్వం, కదిర పచ్చ, పన్నీరు తదితర ఆరు రకాల పత్రాలు. వీటితో తిరుచానూరు పద్మావతి అమ్మవారికి బుధవారం అర్చకులు పుష్పయాగం నిర్వహించారు. కార్తీక బ్రహ్మోత్సవాల్లో జరిగిన ఆగమయుక్త కార్యక్రమాల్లో తెలిసో తెలియకో చోటు చేసుకున్న దోషాలకు ప్రాయశ్చిత్తంగా.. ఉత్సవాలు ముగిసిన మరుసటిరోజు పుష్పయాగం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా దాతల ద్వారా సేకరించిన నాలుగు టన్నుల పుష్పాలు, పత్రాలను గంపల్లో అమర్చి ఆస్థాన మండపంలో పూజలు నిర్వహించారు. ఆలయ ఉద్యోగులు, శ్రీవారి సేవకులు ఈ గంపలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. మధ్యాహ్నం 3గంటలకు యాగశాలలో ప్రాయశ్చిత, శాంతిహోమం, పూర్ణాహుతి నిర్వహించారు. సాయంత్రం 5గంటలకు సన్నిధి నుంచి అమ్మవారిని వేంచేపుగా శ్రీకృష్ణ స్వామి ముఖమండపంలో కొలువు దీర్చారు. 8గంటల వరకు వేదమంత్రాలు పఠిస్తూ పుష్పాలను అమ్మవారిపై చల్లుతూ పుష్పాభిషేకం చేశారు. ఈ నాలుగు టన్నుల పుష్పాలను ఏపీ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచీ దాతలు వితరణగా అందించినట్లు టీటీడీ ఉద్యానశాఖ అధికారిడిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో రాధాకృష్ణమూర్తి, అర్చకులు బాబుస్వామి, మణికంఠస్వామి, సూపరింటెండెంట్లు రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతి, సుబ్బరాయుడు సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు పుట్టింటి ఆతిథ్యం

పద్మావతీ అమ్మవారికి గురువారం మహంతు ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాలు ముగిసిన రెండో రోజు అమ్మవారు తన పుట్టింటికి వెళ్లి ఆతిథ్యం స్వీకరించడంలో భాగంగా పద్మసరోవరం వద్దనున్న హథీరాంమఠంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఉత్సవాన్ని నిర్వహిస్తారు. కాగా, గురువారం నుంచి అమ్మవారి ఆలయంలో యథావిధిగా ఆర్జిత సేవలు జరుగుతాయని అధికారులు తెలిపారు.

నీకొకటి.. నాకొకటి

● అప్పుడు వారు.. ఇప్పుడు వీరు

● రుయాలో రెండు మెడికల్ షాపులను పంచుకున్న నేతలు

తిరుపతి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌లో మెడికల్ మాఫియాకు బ్రేక్ పడిందని అనుకునే లోపే, పక్కనే ఉన్న రుయాస్పత్రికి విస్తరించింది. రాజకీయ నేతల ఒత్తిళ్లతో బుధవారం రెండు జనరిక్ మెడికల్ షాపులకు అనుమతిస్తూ నోట్‌ఫైల్ సిద్ధమైనట్లు తెలిసింది. ఇరు పార్టీలకు చెందిన ఇద్దరు ప్రజాప్రతినిధులు సిఫారసు లేఖలతో రెండు మెడికల్ షాపులను నామమాత్రపు అద్దెకు ఇచ్చేందుకు రంగం సిద్ధమైంది. ఏకంగా రుయాలోని స్థలం కేటాయించి గదులను వారినే కట్టుకోమని సూచించినట్టు సమాచారం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రుయాస్పత్రిలో మెడికల్ షాపులకోసం నలుగురు నాయకుల నుంచి నాలుగు దరఖాస్తులు ఏడాది క్రితమే అధికారులకు అందాయి. ప్రతి ప్రభుత్వ వైద్యశాలలో జనరిక్ మెడికల్ షాపు ఉండాలని, వాటిని రెడ్‌క్రాస్ సొసైటీ మాత్రమే నిర్వహించాలని మే నెలలో రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది. దీంతో అధికారులు బయట వ్యక్తులకు కేటాయించలేకపోయారు.

ఇదిలావుంటే 2005లో టెండరు ద్వారా దక్కించుకున్న రెండు ప్రైవేట్ మెడికల్ షాపులు 2019వరకు రుయాకు అద్దెచెల్లిస్తూ నిర్వహించుకుంటూ వచ్చాయి. వైసీపీ అధికారంలోకి వచ్చాక బలవంతంగా ఖాళీ చేయించి, ఆపార్టీ అనుచరులకు కట్టబెట్టారన్న విమర్శలు వచ్చాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కోర్టును ఆశ్రయించి మళ్లీ వాటిని పూర్వపు నిర్వాహకులే చేజిక్కుంచుకుని ఇటీవల ప్రారంభించారు. ఈ రెండు కాకుండా మరొకటి రెడ్ క్రాస్ సొసైటీ జనరిక్ మెడికల్ షాపు నిర్వహిస్తోంది. జీవో నెంబరు 516 నిబంధనల మేరకు వెయ్యి పడకలు దాటిన ఆస్పత్రిలో మూడు మెడికల్ షాపులు మాత్రమే ఉండాలి. ఆ మేరకు రుయాస్పత్రిలో ప్రస్తుతం 3 మెడికల్ షాపులు ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా మరో రెండు షాపులు కేటాయిస్తే రుయాలో మొత్తం 5 మెడికల్ షాపులు ఉన్నట్లు అవుతుంది. రాజకీయ ఒత్తిళ్లను తట్టుకోలేకనే రుయా అధికారులు మెడికల్ షాపులను కేటాయిస్తున్నట్టు తెలుస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా అప్పగిస్తున్న మెడికల్ షాపులను హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ ఛైర్మన్‌గా వ్యవహరించే కలెక్టర్ అనుమతి తీసుకున్నారా? లేదా? అన్న అనుమానం కలుగుతోంది.

నేడు ప్రముఖ రచయిత్రి ఓల్గా రాక

● తండ్రి పేర పద్మావతి వర్సిటీలో ధర్మనిధి సదస్సు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీ తెలుగు విభాగానికి గురువారం ప్రముఖ రచయిత్రి ఓల్గా రానున్నారు. తన తండ్రి పోపూరి వేంకట సుబ్బారావు పేర ఏటా ఏటా ధర్మనిధి సదస్సులో ఆమె పాల్గొంటారు. గురువారం ఉదయం 10 గంటలకు సావేరీ హాల్లో ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది.

రైల్వే అధికారి మృతి

తిరుపతి (నేరవిభాగం), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో బుధవారం గుండెపోటుతో రైల్వే అధికారి మృతి చెందారు. తిరుపతి ఈస్ట్ ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపిన ప్రకారం.. ఏర్పేడు మండలం అంజిమేడుకు చెందిన మల్లికార్జునరెడ్డి (57)హైదరాబాదులో రైల్వే ఆఫీసు సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు. బుధవారం హైదరాబాదు నుంచి తిరుపతికి వచ్చారు. ఈ క్రమంలో రేణిగుంటలో దిగి టీ తాగి బంధువులతో ఫోన్‌లో మాట్లాడాడు. తిరుపతికి బస్సు చేరుకున్నా.. ఎంతసేపటికీ ఆయన దిగలేదు. అనుమానం వచ్చిన బస్సు డ్రైవర్ అతడి వద్దకు వెళ్లి చూడగా సొమ్మసిల్లి పడి ఉన్నారు. వెంటనే ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారని ఎస్‌ఐ చెప్పారు. జరిగిన ఘటనపై మృతుడు సోదరుడు దశరథరామయ్యకు సమాచారం ఇచ్చారు. అతను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాకు తరలించారు.

సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యం

● ఎన్‌సీసీ ఏపీ-టీజీ డీడీజీ నర్సింగ్ సైలాని

● గిరిపురాన్ని దత్తత తీసుకున్న ఎన్‌సీసీ తిరుపతి గ్రూపు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇకపై సామాజిక సేవా కార్యక్రమాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తామని ఎన్‌సీసీ ఏపీ, తెలంగాణ రాష్ట్రాల డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (డీడీజీ) నర్సింగ్ సైలాని పేర్కొన్నారు. తిరుపతి ఎన్‌సీసీ గ్రూపును బుధవారం ఆయన సందర్శించారు. పచ్చదనం, పరిశుభ్రత వంటి కార్యక్రమాల్లో ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొనేలా చేస్తామన్నారు. తద్వారా ఎన్‌సీసీ క్యాడెట్లలో సేవా స్ఫూర్తి, నాయకత్వ లక్షణాల పెంపు, సామాజిక బాధ్యత అలవడేలా చూస్తామన్నారు. తిరుపతిలోని గిరిపురం ప్రాంతాన్ని ఎన్‌సీసీ తిరుపతి గ్రూపు దత్తత తీసుకుంది. నగరపాలక సంస్థ సహకారంతో పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణపై ఈ ప్రాంతంలోని ప్రజల్లో అవగాహన కల్పిస్తామని సైలానీ తెలిపారు. ఈ సమావేశంలో ఎంసీటీ ఆరోగ్యాధికారి అన్వేష్, ఎన్‌సీసీ అధికారులు సతీష్ దాహియా, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

కారు, బస్సు ఢీ ● ఐదుగురికి తీవ్ర గాయాలు



నుజ్జునుజ్జు అయిన కారు

పుత్తూరు అర్బన్, నవంబర్ 26(ఆంధ్రజ్యోతి): పుత్తూరు సమీపంలోని పరమేశ్వర మంగళం వద్ద కారు, బస్సు ఢీ కొన్నాయి. శ్రీకాళహస్తి నుంచి కంచికి వెళుతున్న కారు ఊుడ వాహనాన్ని అధిగమించబోయి కంచి నుంచి తిరుపతికి వస్తున్న తమిళనాడు ఆర్టీసీ బస్సును ఢీ కొంది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న ఐదుగురు ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. కారులో ప్రయాణిస్తున్న వారికి చిన్నపాటి గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేయించి కాంచీపురం ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సెప్టిక్‌ట్యాంకు క్లీనింగ్ వాహనానికి దరఖాస్తు చేసుకోండి

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తిరుపతిజిల్లా పరిధిలో మూడు వేల లీటర్ల సామర్థ్యం గల సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వాహనాన్ని ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ పథకం కింద పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని షెడ్యూల్డ్ కులాల సేవాసహకార సంఘం కార్యనిర్వాహక సంచాలకుడు విక్రమ్‌కుమార్‌రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'యూనిట్ విలువ రూ.31,67,326. సబ్సిడీ రూ.14,16,831.50, ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ రుణం రూ.17,50,494.50 ఇస్తున్నారు. జిల్లాలోని ఎస్సీలకు చెందిన సఫాయి కర్మాచారి వృత్తిలో ఉన్న వారు అర్హులు. ఈనెల 30వ తేదీ లోపు దరఖాస్తులు పంపాలి. మరిన్ని వివరాలకు 91007 56863 నెంబరులో సంప్రదించాలి' అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



తిరుమల కొండల్లో ఏనుగుల జాడను గుర్తిస్తున్న వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ బృందం

'గజ' గమనం పరిశోధిస్తున్నాం

● వైల్డ్ లైఫ్ ఇండియా ప్రాజెక్టు అసోసియేట్ బాలాజీ

మంగళం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ముఖ్యంగా తిరుమల అటవీప్రాంతాల్లో గజరాజులు ఎలా వస్తున్నాయి? ఎక్కడికి వెళుతున్నాయి? అనే దానిపై అధ్యయనం చేయడానికి వచ్చామని వైల్డ్‌లైఫ్ ఇండియా అసోసియేట్ బాలాజీ చెప్పారు. బుధవారం డెహ్రాడూన్ నుంచి ఆరుగురు సభ్యులతో కూడిన బృందం, తిరుపతికి చెందిన ఒక బయాలజిస్టు, ఐదుగురు ప్రొటెక్షన్ వాచర్లు తిరుమల కొండల్లో పర్యటించారు. తిరుమల కొండల్లో నుంచి భాకారపేట, మామండూరు, పరిసర ప్రాంతాల్లోకి ఏనుగులు రాకపోకలు సాగిస్తున్నట్లు గుర్తించారు. ఈ ప్రాంతాల్లో ఉన్న ఏనుగులు.. వీటిలో ఆడ, మగ ఎన్ని? ఎక్కువ కాలం ఏ ప్రాంతంలో ఉంటున్నాయనే అంశాలను అధ్యయనం చేస్తామన్నారు. వీటికి ఆహారం, నీరు లభించే ప్రాంతాలను కూడా పరిశీలిస్తామన్నారు. ఏనుగుల పాదముద్రలు, వాటి విసర్జకాలను కూడాపరిశీలిస్తామని చెప్పారు. ఏనుగుల ట్రాకింగ్‌పై పూర్తి అవగాహన వచ్చాక అటవీప్రాంతాల నుంచి జనంలోకి, పంట పొలాల్లోకి రాకుండా ఎలా నియంత్రించాలనే దానిపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని ఆయన చెప్పారు.

నాలుగు లేబర్‌కోడ్, అగ్రి నల్లచట్టాలు రద్దు చేయాలి

● వామపక్షాలు, రైతు కార్మిక సంఘాల డిమాండ్ ● కలెక్టరేట్ వద్ద కార్మిక సంఘాల ఆందోళన



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వామపక్షాల నాయకులు

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్, మూడు వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేయాలని వామపక్షాలకు చెందిన కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. కలెక్టరేట్ వద్ద బుధవారం ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, రైతు సంఘాలు ఆందోళన నిర్వహించాయి. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి, సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, సీపీఐ ఎంఎల్ నగర కార్యదర్శి వెంకటరత్నం మాట్లాడుతూ ఎప్పుడో పార్లమెంట్‌లో ఆమోదించిననాలుగు లేబర్ కోడ్‌ను అమలు బిహార్ ఎన్నికల తర్వాత అమల్లోకి వస్తాయని ఆర్డినెన్సు విడుదల చేయడం దుర్మార్గమన్నారు. వ్యవసాయ నల్లచట్టాల రద్దుకోసం ఉద్యమించిన రైతాంగానికి క్షమాపణ చెప్పి ఉపసంహరించుకుంటామన్న ప్రధాని మోదీ.. ఇప్పుడా మాట విస్మరించారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలోనూ పదిగంటలకుపైగా పనిచేయించుకోవచ్చని అసెంబ్లీలో తీర్మానం చేయడం దుర్మార్గమని ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, జయచంద్ర పేర్కొన్నారు. ఈ ఆందోళనలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు హేమలత, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి చిన్నం పెంచులయ్య, వివిధ కార్మిక సంఘాల నేతలు విజయకుమార్, రాజా, రవి, వేణుగోపాల్, రాధాకృష్ణ, సాయిలక్ష్మి, గంగ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతలో పాడిపరిశ్రమది కీలక భూమిక

● జాతీయ పాలదినోత్సవంలో వెటర్నరీ వీసీ జేవీ రమణ



తిరుపతిరూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతలో పాడిపరిశ్రమరంగం కీలక భూమిక పోషిస్తోందని ఎస్వీ వెటర్నరీ వర్సిటీ ఇన్‌చార్జి వీసీ జేవీరమణ పేర్కొన్నారు. శ్వేతవిప్లవ పితామహుడు డాక్టర్ వర్గీస్ కురియన్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఇండియన్ డెయిరీ అసోసియేషన్ ఏపీ లోకల్ చాప్టర్, డెయిరీ టెక్నాలజీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జాతీయ పాలదినోత్సవంలో ఆయన మాట్లాడారు. దేశంలో పాడి పరిశ్రమ అభివృద్ధి, మహిళాసాధికారితలో కురియన్ సేవలు మరువలేనివన్నారు. చిత్తూరుజిల్లా కుప్పం మండలం, గరిగచ్చినేపల్లెకి చెందిన చంద్రశేఖర్ నాగజ్యోతిని ఐడీఏ-ఏపీలోకల్ చాప్టర్ ద్వారా ఉత్తమ మహిళా పాడిరైతుగా ఎంపిక చేసి రూ.10వేల నగదు, సర్టిఫికెట్‌తో సన్మానించారు. అలాగే నగరంలోని అగ్రికల్చర్, వెటర్నరీ, డెయిరీ టెక్నాలజీ, ఎస్వీఆర్వ్ కళాశాల, పద్మావతి మహిళా వర్సిటీ విద్యార్థులకు పాల ఉత్పత్తిదారులకు మెరుగైన రాబడిని నిర్ధారించడం అనేఅంశంపై వక్తృత్వపోటీలు నిర్వహించారు. తొలిమూడుస్థానాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఐడీఏ-ఏపీలోకల్ చాప్టర్ ఛైర్మన్ డాక్టర్ రవికుమార్, డెయిరీటెక్నాలజీ డీన్, లోకల్ చాప్టర్ కార్యదర్శి డాక్టర్ కె.నాగేశ్వరరావు, అసోసియేట్ డీన్ డాక్టర్ జి.గంగరాజు, డాక్టర్ మంజునాథ, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలను పాటించని వాహనదారులకు రూ.3.17 లక్షల జరిమానా

తిరుమల, నవంబరు26(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలను పాటించని వాహనదారులకు బుధవారం అధికారులు రూ.3.17 లక్షల జరిమాన విధించారు. తిరుపతి రవాణాశాఖ, ట్రాఫిక్ అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి తిరుమల మొదటి, రెండవ ఘాట్‌రోడ్లలో బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇందులో హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించిన వారితో పాటు డ్రైవింగ్ లైసెన్స్, సరైన వాహనాల పత్రాలు లేని వారికి 105 చలానాల ద్వారా రూ.3.17 లక్షల జరిమాన విధించారు. నిత్యం రద్దీతో కూడిన తిరుమల క్షేత్రానికి వచ్చేవెళ్లేవారందరు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని అధికారులు సూచించారు. ఈ దాడుల్లో ట్రాఫిక్ సీఐ హరిప్రసాద్, రవాణశాఖ అధికారులు శ్రీనివాసులు, అధిక నాజ్, స్వర్ణలత, వెంకటరమణ, ఆంజనేయప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

పుత్తూరులో తండ్రిపై కూతురు కిడ్నాప్ కేసు

పుత్తూరు అర్బన్, నవంబర్ 26(ఆంధ్రజ్యోతి): తనతో పాటు తన భర్తను కిడ్నాప్ చేయబోయాడని తండ్రిపై కూతురు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు తండ్రి చంద్రబాబుపె పోలీసులు కిడ్నాప్ యత్నం కేసు నమోదు చేశారు. కల్యాణపురానికి చెందిన చంద్రబాబు పశు వైద్యుడు. కుటుంబ సమేతంగా కార్వేటినగరంలోని చర్చికి వెళ్లి ప్రార్థనలు నిర్వహించే వారు. ఈ క్రమంలో పవిత్ర ఎస్ఆర్‌పురం మండలం పొదలపల్లికి చెందిన గిరిప్రసాద్‌ను రెండు నెలల క్రితం తల్లిదండ్రుల సమ్మతి లేకుండా వివాహం చేసుకుంది. ఈక్రమంలో తల్లికి బాగాలేదని పవిత్రను పిలిపించిన చంద్రబాబు... గిరిప్రసాద్‌ను కార్వేటినగరంలో రోడ్డులోని ఎస్ఎస్ బేకరి వద్ద నెంబర్ ప్లేట్ లేని కారులో తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పెనుగులాట జరిగి, కారు నుంచి బయటపడిన పవిత్ర, గిరిప్రసాద్ పుత్తూరు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జంతు మార్కెట్ యాప్ ఆవిష్కరణ



యాప్‌ను ప్రారంభిస్తున్న వీసీ నరసింగరావు తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ ఇంజినీరింగ్ కాలేజీ కంప్యూటర్ సైన్స్ నాలుగో సంవత్సర విద్యార్థి ఎం.పూర్ణప్రసాద్ రూపొందించిన జంతు మార్కెట్ యాప్‌ను వీసీ నరసింగరావు, రెక్టార్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు బుధవారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పూర్ణచంద్ రూపొందించిన యాప్ ద్వారా జంతువులు, పశుగ్రాసం, పాల ఉత్పత్తులు, కూరగాయలు, పండ్లు, పంట ఉత్పత్తుల కొనుగోలు అమ్మకం, రైతులు పశు వైద్యులను సంప్రదించడానికీ, టీకా రిమైండ్ చేయడానికీ, పశువుల ధర వంటి వివరాలు పొందుపర్చినట్లు చెప్పారు. ఈ యాప్ రూపొందించడంలో ప్రొఫెసర్ వివేకానంద రెడ్డి మార్గదర్శకత్వం వహించారు. సీడీసీ డీన్ చెంద్రాయుడు, రీసెర్చ్ డీన్ నరసింహ, ప్రిన్సిపాళ్ళు శ్రీనివాసులు, సుధారాణి, వెంకటేశ్వర్లు, పద్మావతి పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో రాజ్యాంగ దినోత్సవం



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న అధికారులు

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం 76వ భారతరరాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి అధికారులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం రాజ్యాంగ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్ర రెడ్డి, రోజ్మాండ్‌తో పాటు సుధారాణి, శివశంకర్‌నాయక్, కలెక్టరేట్ ఏవో రమేష్ బాబు, తహసీల్దారు శిరీష తదితరులు పాల్గొన్నారు.